www.flashindianews.com

# ఫ్లాష్ ఇండియా

తెలుగు దినపత్రిక

FLASH INDIA TELUGU DAILY


RNI NO. APTEL/2010/33229

**విలేకరులు కావలెను**

17 సం॥ లుగా వెలువడుతున్న "ఫ్లాష్ ఇండియా" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాల వారీగా విలేకరులు కావలెను..

సెల్ నెంబర్: 9951494039

సంపుటి : 17 | సంచిక :55 | శుక్రవారం 27.03.2026 | ఎడిటర్ :కొమరాజు శ్రీనివాసులు | పేజీలు :08 | వెల : రూ 2/-



## రాష్ట్రాన్ని రోల్ మోడల్ గా తీర్చిదిద్దుతాం

### ఆరోగ్యశ్రీపై అపోహలు వద్దు

### రూ.2,408 కోట్లు చెల్లించాం

పెండింగ్ రూ.727 కోట్లు మాత్రమే

- పరిమితిని రూ. 10 లక్షలకు పెంచాం
- గత ప్రభుత్వ బకాయిలు చెల్లించాం
- ప్రైవేటు ఆస్పత్రుల మూత అంటూ దుష్ప్రచారం
- పేద కుటుంబాలకు ఇందిరమ్మ జీవిత బీమా
- అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- మీ నిర్వాకంతోనే బకాయిలు

03

### మీ పాలనలో పీఏలు చేతివాటం

- ఇప్పటికే ఆరోగ్య శ్రీ కింద ₹2,408 కోట్ల బిల్లులు చెల్లించాం
- ప్రతి నెల ₹89 కోట్లు అందజేస్తున్నాం
- 27 నెలల కాలంలో ₹4500 కోట్లు వైద్యానికి నిధులిచ్చాం
- హరీష్ రావుకి కౌంటర్ ఇచ్చిన రేవంత్ రెడ్డి

గత ప్రభుత్వం సుమారు రూ. 600 కోట్ల ఆరోగ్యశ్రీ బకాయిలు పెట్టిందని విమర్శించారు. అందులో ప్రభుత్వ ఎయిడెడ్ ఆస్పత్రులకు రూ. 240 కోట్లు, ప్రైవేటు ఆస్పత్రులకు రూ. 360 కోట్ల బకాయిలు ఉన్నాయని తెలిపారు. తాము అధికారంలోకి వచ్చాక ప్రతి నెలా సగటున రూ. 89 కోట్లు ఖర్చు చేస్తూ, మొత్తంగా రూ. 2,408 కోట్ల ఆరోగ్యశ్రీ బకాయిలను క్లియర్ చేశామని అన్నారు. అందులో ప్రభుత్వ ఎయిడెడ్ ఆస్పత్రులకు రూ. 927 కోట్లు, ప్రైవేటు ఆస్పత్రులకు రూ. 1,480 కోట్లు చెల్లింపులు జరిగాయని వెల్లడించారు.

# 14 మంది సజీవ దహనం

## ఏపీలోని మార్కాపురం జిల్లాలో ఘటన





### టిప్పర్ ను ఢీకొట్టిన ప్రైవేటు బస్సు

- 23 మందికి గాయాలు వారిలో ఐదుగురి పరిస్థితి విషమం
- కిటికీ అద్దాలు పగులగొట్టి బయటపడ్డ కొందరు
- హైదరాబాద్ నుంచి పామూరు వెళ్తుండగా ఘటన
- మృతుల్లో ఇద్దరు జగిత్యాల జిల్లా రాయికల్ వాసులు
- క్షణాల్లో రెండు వాహనాలు అగ్నికి ఆహుతి
- మృత్యువుతో పోరాడుతున్న మరో ఐదుగురు
- బస్సు నుంచి క్షేమంగా బయటపడ్డ 10 మంది ప్రయాణికులు
- బాధితులను ఆదుకోవాలని అధికారులకు ఆదేశం
- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పలువురు మంత్రులు

05

ఏపీలోని మార్కాపురం జిల్లా రాయవరం సమీపంలో పలకల క్వారీల వద్ద గురువారం ఉదయం ఘోర ప్రమాదం జరిగింది. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు, టిప్పర్ ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో 14మంది ప్రయాణికులు సజీవ దహనం అయ్యారు. టిప్పర్ డీజిల్ ట్యాంక్ పగిలిపోవడంతో క్షణాల్లో మంటలు వ్యాపించాయి. బస్సు పూర్తిగా కాలిపోయింది. తెల్లవారుజామున ప్రయాణికులు గాఢ నిద్రలో ఉన్నప్పుడు హరికృష్ణ ట్రావెల్స్కు చెందిన బస్ ఎదురుగా వస్తున్న టిప్పర్ ను ఢీ కొట్టడంతో ఈ ప్రమాదం సంభవించింది. యాక్సిడెంట్ జరిగిన సమయంలో బస్సులో ...

### ప్రధాని మోదీ దిగ్భ్రాంతి

మృతుల కుటుంబాలకు 2లక్షల పరిహారం

### సీఎం రేవంత్ సంతాపం

మృతుల కుటుంబాలను ఆదుకుంటాం

### దిగ్భ్రాంతి వ్యక్తంచేసిన సీఎం చంద్రబాబు, డీప్యూటీ సీఎం పవన్

## ఆరోగ్యశ్రీ బిల్లుల్లేవ్!



- మేజర్ సర్జరీలకు ట్రీట్మెంట్ లేదు
- మూతపడే స్థితికి చిన్న దవాఖానాలు
- ఎప్పటివరకు చెల్లిస్తారో స్పష్టత నివ్వాలి
- అసెంబ్లీలో నిలదీసిన హరీష్ రావు

ఐటీ టవర్ల పై సర్కారు నిర్లక్ష్యం బీఆర్ఎస్ హయాంలో జిల్లాలకు ఐటీ విస్తరణ

02

## ఆరోగ్యశ్రీలో విప్లవాత్మక మార్పులు

- ఆరోగ్యశ్రీని బలోపేతం చేస్తున్నాం
- ఆస్పత్రుల సంఖ్యను 537కి పెంచాం
- ఉచిత వైద్యం మొత్తాన్ని ₹10 లక్షలు చేశాం
- హాస్పిటల్ బకాయిలు గణనీయంగా తగ్గించాం
- అసెంబ్లీలో ప్రకటించిన మంత్రి దామోదర

03





## మెరుగైన వసతులు కావాలి..

### ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా సేవలు..

- ఎంఎంటీఎస్ సేవలపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష
- ఆఫీస్ టైమ్స్‌లో ట్రైన్ల సంఖ్య పెంపుపై ఆదేశాలు
- లాస్ట్ మైల్ కనెక్టివిటీపై కీలక సూచనలు
- ప్రయాణికుల కోసం స్టేషన్లలో మెరుగైన సదుపాయాలు

03

### భద్రాద్రికి.. మహర్దశ!

అభివృద్ధికి ₹351 కోట్లు విడుదల

ఉత్తర్వులు జారీ చేసిన దేవాదాయ శాఖ

మరో హామీ నిలబెట్టుకున్న సీఎం రేవంత్

నేడు రాములోరికి రేవంత్ పట్టు వస్త్రాలు సమర్పణ

02

వివరాలు వెల్లడించిన దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్

## హార్ముజ్ గుండా భారత నౌకలకు రైట్ రైట్


మరో నాలుగు దేశాలకు కూడా పచ్చజెండా

మిత్ర దేశాలకు ఆంక్షలు సడలించిన ఇరాన్

జాబితాలో భారత్, రష్యా, చైనా,పాకిస్తాన్, ఇరాక్

పశ్చిమాసియా ఉద్రిక్తతల మధ్య కీలక ప్రకటన

02



పశ్చిమాసియాలో యుద్ధ ఉద్రిక్తతల మధ్య హార్ముజ్ జలసంధిపై ఇరాన్ తన ఆధిప త్యాన్ని కొనసాగిస్తోంది. ఈ నేపథ్యంలో భారత్ సహా ఐదు దేశాల నౌకలకు మినహాయింపు ఇస్తూ సురక్షితంగా ప్రయాణించే అవకాశం కల్పిస్తున్నట్లు ప్రకటించింది. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి మాట్లాడుతూ, తమతో స్నేహపూర్వక సంబంధాలు ఉన్న దేశాల అభ్యర్థన మేరకు వారి నౌకలకు రక్షణ కల్పిస్తున్నామని తెలిపారు. ఈ క్రమంలో చైనా, రష్యా, పాకిస్తాన్, ఇరాక్, భారత్ దేశాల నౌకలు ఇప్పటికే జలసంధి దాటి నట్లు వెల్లడించారు. అయితే అమెరికా, ఇజ్రాయెల్ మరియు యుద్ధంలో పాత్ర ఉన్న గల్ఫ్ దేశాలకు చెందిన నౌకలకు అనుమతి ఇవ్వబోమని స్పష్టం చేశారు.



## పశ్చిమాసియాలో ముదురుతున్న పరిస్థితులు..

- శ్రీరామనవమి రోజున ప్రధాని మోడీ కీలక సమావేశం
- నేడు అన్ని రాష్ట్రాల సీఎంలతో మోడీ వీడియో కాన్ఫరెన్స్
- పశ్చిమాసియా యుద్ధ సంక్షోభంపై కీలక సూచనలు చేసే అవకాశం

02



## ఎక్కడికక్కడే నిలిచిపోయిన వందలాది షిప్స్..

- హర్మూజ్‌లో ఎక్కడికక్కడే నిలిచిపోయిన వందలాది షిప్స్
- మార్చి నెలలో కేవలం 100 ఓడలు మాత్రమే ఈ జలసంధి గుండా వెళ్లగలిగాయి
- అంచనాల ప్రకారం 300 నుంచి 400 వరకు నిలిచిపోయాయి

**ఢిల్లీ :** ప్రపంచంలోనే అతి ముఖ్యమైన ఓడల మార్గమైన హార్ముజ్ జలసంధి వద్ద ప్రస్తుతం భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. విమానం నుంచి తీసిన ఏరియల్ ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ ఫోటోల్లో సముద్రంలో చిన్న చిన్న బొమ్మల్లా వందలాది షిప్స్ ఎక్కడికక్కడే ఆగిపోయి ఉన్నట్లు కనిపిస్తున్నాయి. అమెరికా–ఇజ్రాయెల్– ఇరాన్ మధ్య జరుగుతున్న యుద్ధం కారణంగా ఇరాన్ హార్ముజ్ జలసంధిని దాదాపుగా బ్లాకేడ్ చేసింది. ఫలితంగా మార్చి నెలలో కేవలం 100 ఓడలు మాత్రమే ఈ జలసంధి గుండా వెళ్లగలిగాయి. సాధారణంగా రోజుకు 100 నుంచి 140 ఓడలు వెళ్తాయి, కానీ ఇప్పుడు ట్రాఫిక్ దాదాపు సున్నాకి దిగిపోయింది. పర్షియన్ గల్ఫ్ (పర్శ్యా సముద్రం) లోపల, బయట వందలాది ఓడలు (కొన్ని అంచనాల ప్రకారం 300 నుంచి 400 వరకు) నిలిచిపోయాయి. ఈ జలసంధి ద్వారా ప్రపంచంలోని 20% ఆయిల్, 20% ఎల్ఎన్‌జీ రవాణా జరుగుతుంది. ఇది మూసుకుపోవడం వల్ల ప్రపంచవ్యాప్తంగా ఆయిల్ ధరలు పెరిగాయి. ఎనర్జీ సరఫరాలో సమస్యలు తలెత్తాయి. ప్యాసెంజర్ విమానం విండో నుంచి తీసిన ఫుటేజ్‌లో సముద్రం మొత్తం ఓడలతో నిండి ఉన్నట్లు కనిపిస్తోంది. శాటిలైట్ ఇమేజెస్ కూడా రెండు వైపులా ఓడల క్లస్టర్లను స్పష్టంగా చూపిస్తున్నాయి. ఈ సమస్య వల్ల సుమారు 40,000 మంది సీఫారర్లు (నావికులు) ఓడలపై చిక్కుకుపోయారు. చాలా మంది ఇంటికి తిరిగి రావాలనుకున్నా, యుద్ధ ప్రాంతంలో క్రూ మార్పిడి చేయడం కష్టంగా మారింది. హార్ముజ్ జలసంధి ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు చాలా కీలకమైన చోక్ పాయింట్. ఇక్కడ ట్రాఫిక్ ఆగిపోతే ఆయిల్ ధరలు పెరుగుతాయి. గ్లోబల్ షిప్పింగ్ ఖర్చులు పెరుగుతాయి. ఇంధన సరఫరా సమస్యలు ఏర్పడతాయి.

## పెట్రోల్, డీజిల్ రేట్లు పెంచిన నయారా




**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ప్రస్తుతం దేశీయ చమురు మార్కెట్‌లో నెలకొన్న పరిణామాలు వాహనదారులకు తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నాయి. దేశవ్యాప్తంగా పలు నగరాల్లో పెట్రోల్ కోసం బంకుల వద్ద కిలోమీటర్ల మేర వాహనదారులు క్యూ కడుతుండగా.. ప్రయివేట్ రంగ సంస్థ అయిన నయారా ఎనర్జీస్ పెట్రోల్, డీజిల్ రేట్లను భారీగా పెంచింది. రష్యాకు చెందిన ప్రముఖ చమురు సంస్థ 'రాస్‌నెఫ్ట్' భాగస్వామ్యం కలిగిన నయారా ఎనర్జీ.. లీటరు పెట్రోల్‌పై దాదాపు రూ. 5, డీజిల్‌పై రూ. 3 వరకు పెంచి సామాన్యుడికి షాక్ ఇచ్చింది. అయితే అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడాయిల్ ధరలు అస్థిరంగా ఉండటంతోపాటు సప్లై చైన్ లో ఏర్పడిన అంతరాయాల కారణంగా ఇంధన ధరలు పెంచుతున్నట్టు తెలిపింది. దేశవ్యాప్తంగా దాదాపు 7,000 అవుట్‌లెట్లను నిర్వహిస్తున్న ఈ సంస్థ.. పెరిగిన ధరలను ఇప్పటికే అమలులోకి తెచ్చింది. వివిధ రాష్ట్రాలు విధించే వ్యాట్ ప్రభావంతో కొన్ని ప్రాంతాల్లో ఈ పెంపు గరిష్టంగా లీటరుకు రూ. 5.30 వరకు చేరనుంది. మరోవైపు దేశంలో 90 శాతానికి పైగా మార్కెట్ వాటా కలిగిన ప్రభుత్వ రంగ సంస్థలైన IOCL, BPCL, HPCL సాధారణ పెట్రోల్, డీజిల్ ధరలను ప్రస్తుతానికి స్థిరంగా ఉంచడం వాహనదారులకు పెద్ద ఊరటనిస్తోంది. కాని ఇండస్ట్రియల్ డీజిల్ ధరలను లీటరుకు ఏకంగా రూ. 22 మేర పెంచడం మిగతా పరిశ్రమలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఇక మరో ప్రముఖ ప్రైవేటు సంస్థ రిలయన్స్–బీపీ మాత్రం యథాతథంగా పాత ధరలనే కొనసాగిస్తోంది.

## హార్ముజ్ గుండా భారత
# నౌకలకు రైట్ రైట్

**ఢిల్లీ :** పశ్చిమాసియాలో యుద్ధ ఉద్రిక్తతల మధ్య హర్మూజ్ జలసంధిపై ఇరాన్ తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తోంది. ఈ నేపథ్యంలో భారత్ సహా ఐదు దేశాల నౌకలకు మినహాయింపు ఇస్తూ సురక్షితంగా ప్రయాణించే అవకాశం కల్పిస్తున్నట్లు ప్రకటించింది. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి మాట్లాడుతూ, తమతో స్నేహపూర్వక సంబంధాలు ఉన్న దేశాల అభ్యర్థన మేరకు వారి నౌకలకు రక్షణ కల్పిస్తున్నామని తెలిపారు. ఈ క్రమంలో చైనా, రష్యా, పాకిస్తాన్, ఇరాక్, భారత్ దేశాల నౌకలు ఇప్పటికే జలసంధి దాటి నట్లు వెల్లడించారు. అయితే అమెరికా, ఇజ్రాయెల్ మరియు యుద్ధంలో పాత్ర ఉన్న గల్ఫ్ దేశాలకు చెందిన నౌకలకు అనుమతి ఇవ్వబోమని స్పష్టం చేశారు. ప్రస్తుతం ప్రాంతం యుద్ధ వాతావరణంలో ఉందని, శత్రు దేశాల నౌకలకు మార్గం కల్పించే అవసరం లేదని పేర్కొన్నారు. హర్మూజ్ జలసంధిపై దాదాపు ఐదుదశాబ్దాల తర్వాత ఇరాన్ ఈ స్థాయిలో నియంత్రణ చూపుతోందని, మొదట దీనిని ప్రపంచం బ్లఫ్ గా భావించినా తమ సామర్థ్యాన్ని నిరూపించామని అన్నారు. అమెరికా–ఇజ్రాయెల్ సంయుక్త సైనిక చర్యల అనంతరం ఇరాన్ ఈ జలసంధి ని భాగంగా మూసివేయడంతో ప్రపంచ ఇంధన సరఫరాపై తీవ్ర ప్రభావం పడింది. ప్రపంచ చమురు, ఎల్ఎన్జీ రవాణాలో దాదాపు 20 శాతం ఈ మార్గం ద్వారానే జరుగుతుంది. దీంతో అంతర్జాతీయంగా చమురు, గ్యాస్ ధరలు పెరిగాయి. భారత్ తన ఎల్పీజీ అవసరాల్లో దాదాపు 90 శాతం ఈ మార్గం ద్వారానే దిగుమతి చే సుకోవడంతో కొరత తీవ్రంగా ప్రభావం చూపింది. అయితే ఇటీవల 'నందాదేవి', 'శివాలిక్' వంటి నౌకలకు అనుమతి ఇవ్వ డంతో అవి భారత్కు చేరుకోవడంతో పరి స్థితి కొంత మెరుగుపడింది. భవిష్యత్తులో కూడా స్నేహ దేశాల నౌకలకు ఇలాంటి సౌకర్యం కొనసాగుతుందని ఇరాన్ స్పష్టం చేసింది.

## ఇంధన నిల్వలు ఉన్నాయి..



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలో ఇంధన నిల్వలు ఉన్నాయని.. దీనిపై ఆందోళన అవసరం లేదని ప్రజలకు పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర స్పష్టం చేశారు. గురువారం హైదరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ.. బుధవారం 2,123 ట్యాంకర్స్ పెట్రోల్ సరఫరా చేశామన్నారు. అలాగే 10,799 లీటర్లు సరఫరా చేశారని వివరించారు. యావరేజ్‌గా 5,883 లీటర్ల పెట్రోల్ వినియోగం ఉంటే.. బుధవారం ఒక్క రోజే 84 శాతం అధికంగా పెట్రోల్ సరఫరా చేశారని చెప్పారు. 22,127 కిలో లీటర్ల డీజిల్ ఆయిల్ కంపెనీలు సరఫరా చేశాయని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో పెట్రోల్, డీజిల్ 596 అవుట్ లెట్స్ ఉన్నాయని అన్నారు. ప్రతీ బంక్‌లో పౌరసరఫర, సివిల్ సప్లై, రెవెన్యూ, పోలీస్, లీగల్ మెట్రాలజీ అధికారుల బృందం పరిశీలన చేస్తుందని తెలిపారు. బుధవారం కంటే.. గురువారం పెట్రోల్ బంకుల వద్ద రద్దీ తగ్గిందన్నారు. రాష్ట్రంలో గృహ వినియోగంలో 1,28,24,087 ఎల్పీజీ కనెక్షన్లు ఉన్నాయని.. ప్రతీ రోజు 2,20,000 గ్యాస్ బుకింగ్స్ జరుగుతున్నాయని పేర్కొన్నారు. బుధవారం ఒక్క రోజే 2,19,980 సిలిండర్లు సరఫరా చేశామన్నారు. వినియోగదారులు అధికంగా బుకింగ్స్ చేయడం వల్ల కొంత ఇబ్బంది ఏర్పడుతుందని స్టీఫెన్ రవీంద్ర వివరించారు. అలాగే 1,03,275 పైప్ న్యాచురల్ గ్యాస్ (పీఎన్జీ) కనెక్షన్లు ఉన్నాయని చెప్పారు. 2,78,418 క్యూబిక్ మీటర్లు సరఫరా చేస్తున్నారని తెలిపారు. కేంద్రం ఆదేశాల మేరకు పీఎన్జీ, సీఎన్జీని విస్తరించాల్సి ఉందని చెప్పారు. 24 గంటల్లో ప్లాంట్లకు అనుమతి ఇవ్వడంతో పాటు పలు రాయితీలు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించిందని స్టీఫెన్ రవీంద్ర వివరించారు.

## ఆరోగ్యశ్రీ బిల్లుల్లేవ్!

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఆరోగ్య శ్రీ బిల్లులు గ్రీన్ చానెల్లో విడుదల చేస్తున్నామని ప్రభుత్వం చెప్తున్నది. కానీ, ఆ నిధులు విడుదల కావడం లేదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. గురువారం అసెంబ్లీలో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వంలో 75 లక్షలు ఇస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ₹10 లక్షలు ఇస్తామని చెప్పారు. ₹5 లక్షలు నుంచి ₹10 లక్షలు పెంచడం వల్ల రెండున్నర సంవత్సరాల్లో కేవలం 496 మంది మాత్రమే లబ్ధి పొందారన్నారు. ఎందుకంటే కార్పొరేట్ హాస్పిటల్స్ మేజర్ సర్జరీలకు ఆరోగ్యశ్రీ కింద ట్రీట్మెంట్ ఇవ్వడం లేదు.. దాని మీద రివ్యూ చేయాలని సూచించారు. బీఆర్ఎస్ హయాంలో కూడా ఆరోగ్య శ్రీ కింద ₹5 లక్షల నుంచి ₹15 లక్షల వరకు 607 మందికి డబ్బులు విడుదల చేశామని, కానీ, మీరు 496 మందికే ఇచ్చార న్నారు. ఆరోగ్యశ్రీ సేవలు బంద్ చేస్తామని నోటీసులు ఇచ్చినా బిల్లులు రిలీజ్ కావడం లేదని ఆరోపించారు. చిన్న చిన్న దవాఖానలు మూతపడే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. దయచేసి ఆరోగ్యశ్రీ కింద పెండింగ్ బిల్స్ ఎన్ని ఉన్నాయో.. ఎప్పటిలోగా చెల్లిస్తారో సదరు శాఖకు సంబంధించిన మంత్రి సమాధానం చెప్పాలని హరీష్ రావు డిమాండ్ చేశారు.

**ఐటీ టవర్ల పై సర్కారు నిర్లక్ష్యం**

బీఆర్ఎస్ హయాంలో హైదరాబాద్లోనే కాకుండా జిల్లాల్లోనూ ఐటీని విస్తరించాలని.. అప్పటి కేసీఆర్ ప్రభుత్వం జిల్లాలో ఐటీ టవర్లు నిర్మించింది. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం ఆ ఐటీ టవర్లను నిర్లక్ష్యం చేస్తుందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్రావు అన్నారు. శాసనసభలో గురువారం మాట్లాడుతూ కాంగ్రెస్ విధానాల వల్ల చాలా కంపెనీలు వెళ్లిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సిద్దిపేటలోని ఐటీ టవర్లో కూడా గతంలో 18 కంపెనీలు పనిచేస్తుంటే.. ఇప్పుడు 11 కంపెనీలు మాత్రమే పనిచేస్తు న్నాయని పేర్కొన్నారు. కనీసం ఇంటర్నెట్ బిల్ కట్టకపోవడం వల్ల ఇంటర్నెట్ కూడా కట్ చేశారు. ఐటీ టవర్లో పని చేసే ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు కూడా నాలుగు నెలల నుండి జీతాలు ఇవ్వలేదన్నారు. అలాగే గతంలో వాళ్లకు మూడేళ్లు ఫ్రీ రెంటల్ ఫెసిలిటీ కల్పించా ము. ఇప్పుడు వాళ్లకు మరో మూడేళ్లు ఫ్రీ రెంటల్ ఫెసిలిటీ కొనసాగించాలని కోరారు.

## జగ్గారెడ్డిపై మనుషుల అక్రమ రవాణా కేసు..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డికి భారీ ఊరట లభించింది. మానవ అక్రమ రవాణా కేసులో జగ్గారెడ్డితో పాటు కాంగ్రెస్ నేత కుసుమ కుమార్‌పై నమోదైన కేసును ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టు కొట్టివేసింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో నమోదు చేసిన ఈ కేసులో A1 గా ఉన్న జగ్గారెడ్డి, A3గా ఉన్న కుసుమ కుమార్‌ల కేసులో నేరాలు రుజువు కాలేదని వారిని నిర్దోషులుగా ప్రకటిస్తూ తీర్పు వెలువరించింది.

**కేసు ఏంటి?:**

కాగా 2004లో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో జగ్గారెడ్డి నకిలీ డాక్యుమెంట్లు సమర్పించి భార్య పిల్లలుగా పేర్కొంటూ వేరే ముగ్గురు వ్యక్తులను అమెరికాకు తీసుకువెళ్లారని ఆరోపణలు ఉన్నాయి. తన వెంట ఒక మహిళ ఒక యువకుడిని అమెరికా తీసుకువెళ్లిన జగ్గారెడ్డి తిరిగి ఆయన ఒక్కరే భారత్‌కు తిరిగి వచ్చారనే ఆరోపణలు ఉన్నాయి. నాడు ఎమ్మెల్యేగా, విప్ గా అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారంటూ 2018లో ఆయన్ను పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం బెయిల్ పై ఆయన బయటకు వచ్చారు. తాజాగా ఈ కేసుకు సంబంధించి కోర్టు తీర్పు వెలువరించింది.

## పశ్చిమాసియాలో ముదురుతున్న పరిస్థితులు..



**ఢిల్లీ :** పశ్చిమ ఆసియాలో ఇజ్రాయెల్/అమెరికా – ఇరాన్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతలు అంతర్జాతీయంగా ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ యుద్ధ మేఘాల ప్రభావం ప్రపంచ దేశాలతో పాటు భారత్‌పై కూడా పడే అవకాశం ఉండటంతో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ముఖ్యంగా దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ మరియు వంటగ్యాస్ సరఫరాలో తలెత్తుతున్న ఇబ్బందులను అధిగమించేందుకు ప్రధాని నరేంద్ర మోడీ స్వయంగా రంగంలోకి దిగారు. పశ్చిమ ఆసియా పరిణామాలపై చర్చించేందుకు ప్రధాని మోడీ నేడు అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో అత్యున్నత స్థాయి సమావేశం నిర్వహించనున్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగే ఈ భేటీలో పలు అంశాలపై చర్చించనున్నారు.

**రాష్ట్రాలకు ఆదేశాలు..**

అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరల పెరుగుదల మరియు దేశీయంగా పెట్రోల్, డీజిల్ నిల్వలపై సమీక్షించనున్నారు. ఇంధన కొరత ఉందంటూ వస్తున్న పుకార్లను అడ్డుకోవడం, ప్రజల్లో భయాందోళనలు కలగకుండా చూడాలని ఆదేశాలివ్వనున్నారు. రాష్ట్రాల వారీగా గ్యాస్ మరియు పెట్రోల్ సరఫరాలో ఎక్కడా అంతరాయం కలగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించనున్నారు. యుద్ధం కారణంగా గల్ఫ్ దేశాల నుండి చమురు రవాణాకు ఆటంకం ఏర్పడటంతో భారత్‌లో గ్యాస్, పెట్రోల్ కష్టాలు మొదలయ్యే అవకాశం ఉందన్న వార్తలు వినిపిస్తున్నాయి. దీనిపై కేంద్ర పెట్రోలియం శాఖ ఇప్పటికే స్పందించింది. భారత్‌లో ప్రస్తుతం 60 రోజులకు సరిపడా ఇంధన నిల్వలు ఉన్నాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. యుద్ధం వల్ల సముద్ర మార్గాల్లో రవాణా ఇబ్బందులు ఎదురైతే ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా చమురు దిగుమతి చేసుకునేలా ప్రణాళికలు సిద్ధం చేసింది. చమురు నిల్వలను బ్లాక్ మార్కెట్ చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, పెట్రోల్ బంకుల వద్ద భారీ క్యూలు లేకుండా పర్యవేక్షించాలని ఇప్పటికే కేంద్రం రాష్ట్రాలకు సూచించింది. రేపటి సమావేశం తర్వాత ఇంధన వినియోగం మరియు ధరల నియంత్రణపై కేంద్రం మరిన్ని కీలక మార్గదర్శకాలు విడుదల చేసే అవకాశం ఉంది.

# భద్రాద్రికి.. మహర్దశ!

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** భద్రాచలం దేవస్థానం. పట్టణ సమగ్ర అభివృద్ధికి రాష్ట్ర సర్కారు భారీ ముందడుగు వేసింది. దేవాదాయ శాఖ ప్రతిపాదనలకు ఆమోదం తెలుపుతూ, భద్రాచలం పునరాభివృద్ధిపునరుజ్జీవన కార్యక్రమాల కోసం మొదటి దశలో భాగంగా రూ.351 కోట్ల పరిపాలనా అనుమతిని ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ మేరకు దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్ ఉత్తర్వులు జారీచేశారు. హామీని నిలబెట్టుకున్న ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత ఏడాది భద్రాచలం పర్యటన సందర్భంగా ఇచ్చిన హామీకి అనుగుణంగా ఈ నిర్ణయం వెలువడటం విశేషం. ఈ ప్రక్రియలో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ నిరంతర పర్యవేక్షణ, కృషి కీలక పాత్ర పోషించాయి. ఆమె తీసుకున్న ప్రత్యేక చొరవతో ప్రతిపాదనలు వేగంగా ఆమోదం పొందగా.. ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకుంది.

**మూడు దశల్లో అమలు..**

మొదటి దశలో గోదావరి ఘాట్ విస్తరణ, ఆధునిక వసతులతో అభివృద్ధి. ఆలయ సముదాయం విస్తరణ, పరిసర ప్రాంతాల సదుపాయాల మెరుగుదల వంటి ప్రధాన పనులు చేపట్టనున్నారు. ఇందుకోసం గోదావరి ఘాట్కు రూ.75 కోట్లు, ఆలయ సముదాయానికి రూ.180 కోట్లు, పరిసర అభివృద్ధికి రూ.96 కోట్లు కేటాయించారు. మొత్తం మూడు దశల్లో అమలు కానున్న ఈ ప్రాజెక్టులో రెండో దశలో కాపా రామలక్ష్మమ్మ భూమిలో రూపాంతరాత్మక అభివృద్ధి. మూడో దశలో భద్రాచలం పట్టణ సమగ్ర అభివృద్ధి చేపట్టనున్నారు. మొత్తం ప్రాజెక్టు వ్యయం రూ.586 కోట్లుగా అంచనా వేయబడింది. ఆగమ శాస్త్రాలకు అనుగుణంగా ఆలయ అభివృద్ధి పనులు చేపట్టబడతాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. పనుల అమలును రోడ్లు భవనాల శాఖకు అప్పగిస్తూ.. నిర్దిష్ట గడువులో పూర్తి చేయాలని ఆదేశించింది. హర్షం వ్యక్తం చేసిన మంత్రి ఈ ఉత్తర్వుల పట్ల మంత్రి కొండా సురేఖ సంతోషం వ్యక్తంచేశారు.. తమ ప్రభుత్వం చేతల ప్రభుత్వం అని.. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం, భద్రాచలం క్షేత్ర వైభవాన్ని మరింత అభివృద్ధి చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుతో పర్యాటక రంగానికి కొత్త ఊపు లభించడంతో పాటు, స్థానిక ఆర్థిక వ్యవస్థకు కూడా బలం చేకూరుతుందని తెలిపారు. ఈ నిర్ణయం భద్రాచలం అభివృద్ధి చరిత్రలో కీలక మలుపుగా నిలుస్తూ, ప్రాంతానికి నిజమైన మహర్దశకు నాంది పలుకుతోంది.

**రేవంత్ రెడ్డిది పెద్ద మనసు: తుమ్మల నాగేశ్వరరావు**

శ్రీ రాముడు నడయాడిన భద్రాచలంలో శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయం అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి పెద్ద మనస్సుతో నిధులు మంజూరు చేశారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. మొదటి దశలో రూ.351 కోట్లతో చేపట్టే పనులకు తెలంగాణ సీఎం శంకుస్థాపన చేసారని తెలిపారు. మొత్తం రూ.5.86 కోట్లతో రామాలయంతో పాటు భద్రాచలం పట్టణాభివృద్ధిని మూడు దశల్లో అభివృద్ధి చేసేందుకు మాస్టర్ ప్లాన్ సిద్ధం చేశామన్నారు. శుక్రవారం శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలం లోని మిథిలా కల్యాణ మండపం వేదికగా స్వామివారి కళ్యాణం జరుగుతుంది. అందుకు సంబంధించిన ఏర్పాట్లను మంత్రి తుమ్మల పరిశీలించారు.


**రామయ్యకు రేవంత్ పట్టు వస్త్రాలు..**

అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. శ్రీసీతారామచంద్రస్వామి దంపతులకు ప్రభుత్వం తరపున ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలను సీఎం రేవంత్ రెడ్డి సమర్పించనున్నారని తెలిపారు. అందుకు శుక్రవారం భద్రాచలానికి సీఎం రేవంత్ వస్తున్నార న్నారు. ఆయనకు ప్రజల తరపున ఘనంగా స్వాగతం పలుకుతామని చెప్పారు. భద్రాచలం వచ్చే భక్తుల సౌకర్యార్థం జాతీయ రహదారులు, రైల్వే కనెక్టివిటీ, ఎయిర్ పోర్టు ఏర్పాటు దిశగా అడుగులు వడివడిగా పడుతున్నాయన్నారు.

**భక్తులకు సౌకర్యానికి ఏర్పాట్లు..**

పోలవరం ప్రాజెక్టు పూర్తయ్యాక గోదావరిలో నావిగేషన్ సిస్టమ్ ఏర్పాటుకు అవకాశం ఉందని మంత్రి తుమ్మల ఆశాభావం వ్యక్తం చేశారు. వచ్చే ఏడాది జరగనున్న గోదావరి పుష్కరాలను ఘనంగా నిర్వహించేందుకు ఇప్పటి నుంచే పనులు చేపట్టినట్లు చెప్పారు. సీతారాముల కళ్యాణం వీక్షించే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసు కున్నామన్నారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లపై దేవాలయం అధికారులు, సిబ్బందికి మంత్రి తుమ్మల దిశా నిర్దేశం చేశారు.

## అరచేతిలో 'భూమి' సమాచారం!



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ భూపరిపాలనలో సరికొత్త శకం ఆరంభం కాబోతోందని, గత ప్రభుత్వ హయాంలో ధరణి తెచ్చిన చిక్కుముడులను విప్పుతున్నామని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రైతులకు అత్యంత పారదర్శకంగా, సులభతరమైన సేవలు అందించడమే లక్ష్యంగా కొత్తగా రూపొందించిన ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్(ఇంటిగ్రేటెడ్ డిజిటల్ ల్యాండ్ రికార్డ్స్ మేనేజిమెంట్ సిస్టమ్) ను వచ్చే నెల 2వ తేదీ నుంచి ఐదు మండలాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నట్లు ప్రకటించారు. గురువారం రెవెన్యూ, సర్వే, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, ఎన్ఐసీ అధికారులతో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా భూపరిపాలన సేవలను మరింత వేగవంతంగా అందించడానికి రెవెన్యూ. రిజిస్ట్రేషన్, సర్వే విభాగాలను ఒకే గొడుగు కిందికి తెస్తూ భూభారతి పోర్టల్‌ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. ప్రతి భూ లావాదేవీ వివరాలు కనిపించేలా పారదర్శకంగా పోర్టల్‌ను ఉంటుందన్నారు.

**రిజిస్ట్రేషన్‌కి మ్యాప్...**

ఇంటిగ్రేటెడ్ భూ భారతి పోర్టల్ ను నారాయణపేట జిల్లా కొస్గి, రంగారెడ్డి జిల్లా అమన్‌గల్, సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి, ఖమ్మం జిల్లా కుసుమంచి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట మండలాల్లో వచ్చే నెల 2వ తేదీ నుంచి ప్రయోగాత్మకంగా అమలు చేస్తామని మంత్రి పొంగులేటి తెలిపారు. ఈ పైలెట్ మండలాల్లో మెరిట్– డీమెరిట్ లను క్షుణ్ణంగా పరిశీలించి వాటికి అవసరమైన మార్పులు చేర్పులు చేసి రెండో దశలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో అమలు చేస్తామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు భూభారతి చట్టాన్ని తీసుకువచ్చామని, ధరణి పోర్టల్‌ను బంగాళాఖాతంలో కలిపి భూ భారతి పోర్టల్‌ను కూడా తీసుకొచ్చామన్నారు. భూ భారతి చట్టంలో పేర్కొన్న విధంగా వ్యవసాయ భూములకు సంబంధించి క్రయ విక్రయదారులకు ఇబ్బంది లేకుండా రిజిస్ట్రేషన్ సమయంలో సర్వే మ్యాపును జతపరచే నిబంధనను ఈ ఐదు మండలాల్లో అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. తద్వారా రాష్ట్రంలో భూ వివాదాలకు పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ ఐదు మండలాల్లో ప్రతి సర్వే నెంబరుకు ఆధార్ మాదిరిగానే భూధార్ నంబర్‌ను ఇస్తామన్నారు. ఇప్పటికే ప్రయోగాత్మకంగా నక్షా లేని ఐదు గ్రామాల్లో రీసర్వే నిర్వహించి భూధార్ నంబర్లను కేటాయించినట్లు తెలిపారు.

**పూర్తి సమాచారంతో పోర్టల్...**

ఒక క్లిక్‌తో రైతులకు సంబంధించిన భూముల పూర్తి సమాచారం లభించేలా, చాలా సులువుగా, సులభతరంగా ఉండేలా ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్‌ను రూపొందించామని మంత్రి తెలిపారు. ఆధార్ నెంబర్‌తో అనుసంధానమైన మొబైల్ నెంబర్ ద్వారా లాగిన్ అయిన వెంటనే కావలసిన సమాచారం లభిస్తుందన్నారు. అదే విధంగా పోర్టల్‌లో ప్రధానంగా సమాచారం సేవలు, సర్వే సేవలు, కరెక్షన్ సేవలు, అప్పీల్ సేవలు, రిజిస్ట్రేషన్ సేవలతోపాటు సిటిజన్ డాష్ బోర్డు సేవలకు సంబంధించి మై ల్యాండ్ పోర్ట్ ఫోలియో, నాలా ఆర్డర్స్, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ వివరాలు, ఫీడ్‌బ్యాక్, సంబంధిత అధికారుల వివరాలు, ఆర్వోఆర్, భూధార్ నెంబర్, దరఖాస్తు వివరాలు, మ్యూటేషన్, ఈసీ, మార్కెట్ విలువ, విలేజ్ మ్యాప్, ప్రతి సర్వే నంబర్‌కు మ్యాప్, ఆర్వోఆర్, గ్రామాల నక్షా, పాస్ బుక్ కరెక్షన్ వంటి పూర్తి సమాచారం ఉంటుందన్నారు. అన్ని రకాల సేవలు లభించేలా మూడు విభాగాలను అనుసంధానం చేస్తూ భూ భారతి పోర్టల్ ను పూర్తి స్థాయిలో ప్రజలకు చేరువ చేయబోతున్నామని తెలిపారు. రిజిస్ట్రేషన్, ఇతర భూసేవలకు సంబంధించి దరఖాస్తు చేసుకున్నప్పటి నుంచి ఆ ప్రక్రియ పూర్తయ్యే వరకు ప్రతి స్టేజ్ లో దాని వివరాలను తెలియజేస్తూ ఎస్ఎంఎస్ ద్వారా ఖాతాదారునికి సమాచారం కూడా అందుతుందన్నారు. సమావేశంలో రెవెన్యూ కార్యదర్శి డీఎస్ లోకేష్ కుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు, ఎన్ఐసి అధికారులు పాల్గొన్నారు.


ఫ్లాష్ ఇండియా దినపత్రిక బుక్ చేసుకోవాలి అనుకుంటున్నారా లేదా
మీ వ్యాపార ప్రకటనల కోసం మమ్మల్ని సంప్రదించండి
7730032999
flashindiadaily@gmail.com

# రాష్ట్రాన్ని రోల్ మోడల్ గా తీర్చిదిద్దుతాం

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకానికి రూ.600 కోట్లు బకాయిలు పెట్టి వెళ్తే తాము ప్రతినెలా రూ.89 కోట్లు ఖర్చు పెడుతున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. ఇప్పటివరకు రూ.2,408 కోట్ల బిల్లులు చెల్లించామని అసెంబ్లీ సాక్షిగా తెలిపారు. ఏడో రోజైన నేడు(గురువారం) అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సభలో సీఎం రేవంత్ ప్రసంగించారు. ఆరోగ్య శ్రీ కింద ప్రభుత్వాస్పత్రులకు రూ.927 కోట్లు, ప్రైవేట్ ఆస్పత్రులకు రూ.1,480 కోట్లు చెల్లించామని చెప్పుకొచ్చారు. 27 నెలల్లో పేదల వైద్యం కోసం రూ.4,500 కోట్లు చెల్లించామని ఆయన వివరించారు. పేదలకు అన్యాయం జరుగుతోందని విపక్షాలు అపోహలు సృష్టిస్తున్నాయని.. బీఆర్ఎస్ గత ప్రభుత్వంలో సీఎం రిలీఫ్ ఫండ్ ఎలా దుర్వినియోగం చేశారో అందరికీ తెలుసంటూ విమర్శించారు. ఎవరి పీఏలు సీఎం రిలీఫ్ ఫండ్ కాజేశారో కూడా తెలుసంటూ చురకలు అంటించారు రేవంత్. గత ప్రభుత్వంలో సీఎంఆర్ఎఫ్ నిధులను కొందరు తమ సొంత ఖాతాల్లో వేసుకున్నారని, దీనిపై విచారణ జరుగుతోందన్నారు. త్వరలోనే అన్నీ బయటకు వస్తాయని హెచ్చరించారు. తాము అధికారంలోకి వచ్చాక 27 నెలల్లో రూ.2,046 కోట్ల సీఎంఆర్ఎఫ్ కింద ఇచ్చామని పేర్కొన్నారు. గత ప్రభుత్వం అప్పుల భారాన్ని తమకు వారసత్వంగా ఇచ్చిందని, ఆ బకాయిలను తామే చెల్లిస్తున్నామని చెప్పారు రేవంత్ రెడ్డి. బీఆర్ఎస్ గత ప్రభుత్వం ఆరోగ్యశ్రీ కోసం నెలకు రూ.52 కోట్లు ఖర్చు చేస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం నెలకి రూ.89 కోట్లు ఖర్చు చేస్తోందని తెలిపారు. ఆరోగ్య శ్రీ ఇవ్వకపోవడం వల్ల చికిత్స చేయట్లేదు అనేది అపోహ మాత్రమే అన్నారు. ఇన్ని ఇబ్బందుల్లో కూడా ఆరోగ్య శ్రీ పథకాన్ని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచామని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. విద్యా, వైద్యం విషయంలో కోతలు ఉండవని సీఎం రేవంత్ మరోసారి తేల్చి చెప్పారు. కోతలు పెట్టాల్సి వస్తే వేరే కోతలు పెడతామని అన్నారు. టీచింగ్ కాలేజీల నిర్వహణ గ్రూప్-1 అధికారులకు అప్పగిస్తామని, ప్రతి కుటుంబానికి జీవిత బీమా అందించేందుకు కొత్త పథకం తీసుకువస్తున్నట్లు సీఎం రేవంత్ తెలిపారు.

**ఎన్ఆర్ఐ డాక్టర్లతో డిజిటల్ ప్లాట్ ఫాం**

అందరికీ మెరుగైన విద్య, వైద్యం మా లక్ష్యం అని.. ఆ దిశగా అన్ని చర్యలను చిత్తశుద్ధితో శక్తివంచన లేకుండా చేస్తామన్నారు సీఎం రేవంత్ రెడ్డి. అసెంబ్లీలో మాట్లాడిన సీఎం.. వైద్య రంగంలో తీసుకొస్తున్న విప్లవాత్మకమైన మార్పులకు సంబంధించిన కీలక అంశాలను వెల్లడించారాయన. విదేశాల్లో స్థిరపడిన తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎంతో మంది డాక్టర్లు ఉన్నారని.. వాళ్లందరితో కలిసి రాష్ట్ర ప్రభుత్వం ఓ డిజిటల్ ప్లాట్ ఫాం క్రియేట్ చేయబోతున్నట్లు వెల్లడించారు సీఎం రేవంత్ రెడ్డి. విదేశాల నుంచి రాష్ట్రానికి వచ్చిన సమయంలో.. వాళ్ల సేవలను ఉపయోగించుకోవటానికి ఇది ప్లాట్ ఫాం ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. ఎన్ఆర్ఐ డాక్టర్లు రాష్ట్రానికి వచ్చిన సమయంలో.. తీరిక సమయంలో.. వాళ్లకు సమయం ఉన్నప్పుడు.. వాళ్ల అనుభవాలను ఉపయోగించుకునే విధంగా చర్యలు చేపట్టబోతున్నట్లు వివరించారు సీఎం రేవంత్ రెడ్డి. ఎన్ఆర్ఐ డాక్టర్లతో రాష్ట్రంలోని మెడికల్ కాలేజీల్లో టీచింగ్ చేప్పొచ్చని.. అరుదైన, కీలకమైన చికిత్సలకు సంబంధించి చర్చలు జరపొచ్చని.. ఇక్కడి ఆస్పత్రుల్లో కొన్ని రోజులు సేవలు అందించే విధంగా అద్భుతమైన ప్రణాళికతో ముందుకు వెళుతున్నట్లు వివరించారు సీఎం రేవంత్ రెడ్డి. దీని వల్ల విదేశాల్లో వైద్య విధానం ఎలా ఉంది.. ఇక్కడ ఎలాంటి మార్పులు తీసుకురావొచ్చు అనే విషయాలపై స్పష్టత వస్తుందని.. పరిశోధనలకు ఎంతో ఉపయోగపడుతుందని స్పష్టం చేశారాయన. ఎన్ఆర్ఐ డాక్టర్లు అందర్నీ కలిపే విధంగా ఓ డిజిటల్ ఫ్లాట్ ఫాం అనేది త్వరలోనే రాబోతున్నదని.. దీనికి సంబంధించి పనులు జరుగుతున్నాయన్నారు సీఎం రేవంత్ రెడ్డి. వైద్య రంగంపై చిత్తశుద్ధితో పని చేస్తున్నామని.. కాలానికి తగ్గట్టు మార్పులు తీసుకొస్తూ.. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు స్పష్టం చేశారు సీఎం రేవంత్ రెడ్డి.



## ఆరోగ్యశ్రీలో విప్లవాత్మక మార్పులు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటివరకు 9 లక్షల 45 వేల మందికి ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్య సేవలు అందించినట్లు ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ స్పష్టం చేశారు. గురువారం అసెంబ్లీలో క్వశ్చన్ అవర్ సందర్భంగా ఆరోగ్యశ్రీ బకాయిలు, సేవలపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన వివరణాత్మక సమాధానం ఇచ్చారు. గతంలో ఏడాదికి సగటున 2.5 లక్షల మందికి మాత్రమే సేవలు అందగా, ప్రస్తుతం ఆ సంఖ్య 4 లక్షలకు చేరిందని ఆయన పేర్కొన్నారు. తమ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు చెల్లింపులను భారీగా పెంచిందని, గత ప్రభుత్వ హయాంలో నెలకు సగటున రూ. 52 కోట్లు చెల్లిస్తే, ప్రస్తుతం నెలకు రూ. 89 కోట్లు రెగ్యులర్‌గా చెల్లిస్తున్నామని మంత్రి వెల్లడించారు. గత ప్రభుత్వం నుంచి వచ్చిన రూ. 600 కోట్ల ఆరోగ్యశ్రీ బకాయిలు, రూ. 130 కోట్ల ఈహెచ్ఎస్ బకాయిలను కూడా క్రమంగా తగ్గిస్తూ వస్తున్నామని మంత్రి తెలిపారు. 2023 డిసెంబర్ 8 నుంచి ఇప్పటివరకు సుమారు రూ. 2400 కోట్లకు పైగా పేమెంట్స్ చేశామని, ప్రస్తుతం ప్రైవేట్ ఆస్పత్రులకు కేవలం రూ. 250 కోట్ల బకాయిలు మాత్రమే ఉన్నాయని వివరించారు. ప్రైవేట్ ఆస్పత్రులు ఆరోగ్యశ్రీ సేవలకు నిరాకరిస్తున్నాయన్న ప్రతిపక్షాల ఆరోపణలను ఆయన ఖండించారు. తాము అధికారంలోకి వచ్చే నాటికి 330గా ఉన్న నెట్‌వర్క్ ఆస్పత్రుల సంఖ్య ఇప్పుడు 537కు పెరగడమే తమ పనితీరుకు నిదర్శనమని మంత్రి పేర్కొన్నారు. ములుగు, నారాయణపేట వంటి మారుమూల జిల్లాల్లోనూ ప్రజలకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకున్నామని ఆయన స్పష్టం చేశారు.

# హరీశ్ రావుకు కాంగ్రెస్ కౌంటర్

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** దమ్ముంటే సీఎం రేవంత్ రెడ్డి సిద్దిపేటలో నాపై పోటీ చేయాలి అంటూ మాజీ మంత్రి హరీశ్ రావు చేసిన సవాల్‌కు కాంగ్రెస్ కౌంటర్ ఇచ్చింది. హరీశ్‌రావు చిట్ చాట్ పేరిట బడాయి కబుర్లు, సొల్లు కబుర్లు చెబుతున్నారని ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీను, వేముల వీరేశం ఫైర్ అయ్యారు. దమ్ముంటే రేవంత్ రెడ్డిని సిద్దిపేటకు వచ్చి పోటీ చేయమని మాట్లాడుతున్నారు. సిద్దిపేటలో రేవంత్ రెడ్డి కాదు, వారు బి-ఫాం ఇచ్చిన అభ్యర్థి రాబోయే ఎన్నికల్లో మిమ్మల్ని ఓడగొడుతారని ఆదిశ్రీను జోస్యం చెప్పారు. ఇవాళ అసెంబ్లీలో మాట్లాడుతూ సిద్దిపేటలో రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలవడం ఖాయం అని ధీమా వ్యక్తం చేశారు. తలకిందులు తపస్సు చేసిన మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి రాదని, కేసీఆర్ ముఖ్యమంత్రి కారన్నారు. టీఆర్ఎస్ పార్టీ బీఆర్ఎస్‌గా మారిన రోజే ప్రజలు మీ పార్టీని ఫాం హౌస్ కు పరిమితం చేశారని ఎద్దేవా చేశారు.

**పిచ్చి పిచ్చి కామెంట్లు మానుకో..**

హరీశ్ రావు చిట్ చాట్ పేరుతో ఏవేవేవో మాట్లాడుతున్నారని వేముల వీరేశం విమర్శించారు. రేవంత్ రెడ్డి మిమ్మల్ని గద్దె దించుతాం అని చెప్పి మరీ గద్దె దించారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో మిమ్మల్ని సున్నాకి పరిమితం చేస్తామని చేసి చూపిన దమ్మున్న నాయకుడు రేవంత్ రెడ్డి అన్నారు. మీ పార్టీ అధ్యక్షుడు ఏక్కడా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రికి వస్తున్న ఆదరణ చూసి, ఎదుగుతున్న తీరు జీవించుకోలేక హరీశ్ రావు అక్కసుతో మాట్లాడుతున్నారని ఇకనైనా పిచ్చి పిచ్చి కామెంట్లు మానుకోవాలని హెచ్చరించారు.



## మెరుగైన వసతులు కావాలి..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్ కోర్ అర్బన్ ఏరియాలో ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా ఎంఎంటీఎస్ సర్వీసులు ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. కార్యాలయాల సమయాల్లో ఎంఎంటీఎస్‌ల సంఖ్య పెంచడంతో పాటు క్రమం తప్పకుండా సమయ పాలన పాటిస్తూ సర్వీసులను నడపాలని ఆదేశించారు. ఎంఎంటీఎస్ సర్వీసులపై శాసనమండలి హాల్‌లో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఎంఎంటీఎస్‌లో ప్రయాణికుల తగ్గుముఖంపై ముఖ్యమంత్రి ఆరా తీశారు. ప్రధానంగా ఎంఎంటీఎస్ స్టేషన్ల వద్దకు ఆర్టీసీ బస్సులు వెళ్లేందుకు అవకాశం లేకపోవడం, స్టేషన్లు లోపలికి ఉండటంతో అక్కడకు రాకపోకలు సాగించేందుకు వీలుగా మినీ బస్సులు నడిపే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. ఎంఎంటీఎస్ స్టేషన్లలో ప్రయాణికులకు అవసరమైన అన్ని వసతులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

**మెరుగైన వసతులు కావాలి..**

మెరుగైన వసతులు ఉన్నప్పుడే ప్రయాణికులు ఎంఎంటీఎస్ వైపు మొగ్గు చూపుతారని తెలిపారు. స్వీయ ఆదాయ వనరులు పెంచుకునేందుకు ప్రయత్నించాలని అధికారులకు సూచించారు. లాస్ట్ మైల్ కనెక్టివిటీ పెంపుతో పాటు ప్రయాణికుల సంఖ్య పెంపు, వసతులు మెరుగుపరచడానికి ఉన్న అవకాశాలపై అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో పాటు ప్రభుత్వ ఉన్నతాధికారులు, దక్షిణ మధ్య రైల్వే అధికారులు పాల్గొన్నారు.

# హరీశ్ రావు ఎప్పటికీ సీఎం కాలేరు




**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** మాజీ మంత్రి హరీశ్ రావుపై ప్రభుత్వ విప్ వేముల వీరేశం తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ.. హరీశ్ రావు ఎప్పటికీ ముఖ్యమంత్రి కాలేరన్నారు. హరీశ్ రావుకు దమ్ముంటే బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడై చూపించాలని సవాల్ విసిరారు. పార్టీకి అధ్యక్షుడయ్యే స్థాయి లేని హరీశ్... ముఖ్యమంత్రి గురించి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. హరీశ్ చిట్‌చాట్ పేరుతో చీటింగ్ మాటలు మాట్లాడుతున్నారని వ్యాఖ్యలు చేశారు. గడీలు బద్దలు కొడతామని చెప్పి మరీ చేసి చూపించామన్నారు. ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గుండు సున్నా చేస్తామని రేవంత్ చెప్పారని.. చేసి చూపించారని వేముల వీరేశం తెలిపారు. అసెంబ్లీ నుంచి మున్సిపల్ ఎన్నికల వరకు బీఆర్ఎస్ ఖేల్ ఖతం చేసిన దమ్మున్న నాయకుడు రేవంత్ రెడ్డి అని అన్నారు. 'ఈ దేశం మా రేవంత్ వైపు చూస్తోంది' అని తెలిపారు. హరీశ్ రావు అక్కసు తగ్గించుకోవాలని వేముల వీరేశం హితవు పలికారు. డీలిమిటేషన్‌పై సీఎం రేవంత్ స్పష్టమైన అవగాహనతో ఉన్నారని ప్రభుత్వ విప్ వెల్లడించారు. జనాభా ఆధారంగా డీలిమిటేషన్ చేస్తే తెలంగాణకు అన్యాయం తప్పదన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటనతో సీఎం రేవంత్ జాగ్రత్త పడ్డారని తెలిపారు. దీనిపై తెలంగాణ బీజేపీ నేతలు స్పందించాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గాలు పెరిగితే కాంగ్రెస్ పార్టీకే లాభమన్నారు. ఏ మండలాలు ఏ నియోజకవర్గాల్లో కలిసినా తమకు వచ్చే నష్టమేమీ లేదన్నారు. రేవంత్ ఫొటో పెట్టుకుని ఎన్నికలకు వెళ్తామని.. నియోజకవర్గాలు పెరిగినా అధికారం తమదే అని ప్రభుత్వ విప్ వేముల వీరేశం ధీమా వ్యక్తం చేశారు.

## పీఆర్‌సీ గడువు మళ్లీ పొడిగింపు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులకు మరోసారి నిరాశే మిగిలింది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల వేతన సవరణ కమిషన్ గడువును ప్రభుత్వం పెంచింది. పీఆర్‌సీ గడువు సెప్టెంబర్ నెలాఖరు వరకు పొడిగించింది. ప్రస్తుత పీఆర్‌సీ కమిటీ గడువు మరో ఐదు రోజుల్లో (31 మార్చి)తో ముగియనుంది. ఈ నేపథ్యంలో మరో ఆరు నెలల పాటు కమిటీ గడువును పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కాగా, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు కొత్త పీఆర్‌సీ కోసం చాలా కాలంగా ఎదురు చూస్తున్నారు. కానీ కొత్త పీఆర్‌సీ నివేదిక ఇంకా ప్రభుత్వానికి చేరలేదు. ఈ తరుణంలో కొత్త పీఆర్‌సీ కోసం ఉద్యోగ సంఘాల నేతలు ప్రభుత్వానికి పలుమార్లు వినతిపత్రాలు సమర్పించారు.

**రెండు రోజుల క్రితం అసెంబ్లీలో:**

ప్రస్తుతం బడ్జెట్ సమావేశాల సందర్భంగా విపక్షాలు సైతం ఈ విషయంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోగా కొత్త పీఆర్సీ ఇస్తామని ఎలక్షన్ మేనిఫెస్టోలో చెప్పారని కానీ అధికారంలోకి వచ్చి రెండున్నరేండ్లు కావొస్తున్నా పీఆర్సీ ఇవ్వలేదు. మళ్లీ ఎక్స్‌టెన్షన్ ఇస్తారా? కనీసం ఇప్పుడైనా రిపోర్ట్ తీసుకుని ఉద్యోగులకు కొత్త పీఆర్సీ ఎప్పటిలోగా ఇస్తారో స్పష్టంగా చెప్పాలని రెండు రోజుల క్రితం శాసనసభలో బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అయితే ప్రభుత్వం మాత్రం మరోసారి పీఆర్సీ కమిటీ పొడిగింపుకే మొగ్గు చూపింది.

# చదువుతోనే కుటుంబాల అభివృద్ధి..



**కనగల్,ఫ్లాష్ ఇండియా :** నల్గొండ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే నంబర్ వన్‌గా తీర్చిదిద్దుతానని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. చదువు ద్వారానే కుటుంబాలు బాగుపడతాయని, ప్రతి ఒక్కరూ తమ పిల్లలను తప్పనిసరిగా చదివించాలని ఆయన పిలుపునిచ్చారు. గురువారం నల్గొండ జిల్లా కనగల్ మండల కేంద్రంలో రూ.6 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి మంత్రి భూమి పూజ నిర్వహించారు. అనంతరం కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో రూ.200 కోట్లతో ఆధునిక సౌకర్యాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు నిర్మిస్తున్నామని చెప్పారు. కనగల్‌లో నిర్మిస్తున్న జూనియర్ కళాశాల చుట్టుపక్కల గ్రామాల విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం అందించనున్నట్లు మంత్రి తెలిపారు. నల్గొండలో రూ.150 కోట్లతో ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణం పూర్తయ్యిందని, నర్సింగ్ కళాశాల డిసెంబర్‌లోపు పూర్తి చేస్తామని చెప్పారు. యువతకు ఉపాధి కల్పించేందుకు రూ.20 కోట్లతో న్యాక్ బిల్డింగ్ నిర్మాణం జరుగుతుందని, మహిళలకు సెట్విన్ ద్వారా శిక్షణ కార్యక్రమాలు అందిస్తున్నట్లు వివరించారు. మహిళల సాధికారత కోసం స్వయం సహాయక సంఘాలకు రుణాలు మంజూరు చేయడమే కాకుండా, నల్గొండలో రూ.5 కోట్లతో మహిళల పెట్రోల్ బంక్, సూపర్ మార్కెట్, రెస్టారెంట్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు ద్వారా మహిళలు ఆదాయం పొందవచ్చని సూచించారు. రోడ్ల అభివృద్ధిలో భాగంగా నల్గొండ నుంచి ధర్వేశిపురం వరకు రూ.50 కోట్లతో డబుల్ రోడ్, గుర్రంపోడు వరకు రూ.180 కోట్లతో రహదారి పనులు త్వరలో ప్రారంభమవుతాయని చెప్పారు. కనగల్ ప్రాంతంలో పలు రహదారి పనులకు కూడా నిధులు మంజూరు చేసినట్లు వెల్లడించారు. పేదల సంక్షేమం కోసం రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ, రూ.5 లక్షలతో ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణం కొనసాగుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. కనగల్ అభివృద్ధికి పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. అంతకుముందు మంత్రి ధర్వేశిపురంలోని రేణుక ఎల్లమ్మ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆలయ అభివృద్ధి పై అధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి సభ్యులు శంకర్ నాయక్, జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, ఆర్డీవో అశోక్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి నర్సింగ్ శ్రీనివాస్ గౌడ్, గ్రామ సర్పంచ్ నర్సింగ్ మురళీధర్ గౌడ్, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# జీఎస్టీ సవరణ బిల్లుకు అసెంబ్లీ ఆమోదం..



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ శాసనసభలో వస్తు సేవల పన్ను చట్ట సవరణ బిల్లుకు ఆమోదం లభించింది. గురువారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఈ బిల్లుపై విస్తృత చర్చ జరిగిన అనంతరం, సభ ఏకగ్రీవంగా దీనిని ఆమోదించింది. ప్రధానంగా పన్నుల విభాగంలోని ఉన్నతాధికారుల హోదాలను పునర్వ్యవస్థీకరించే లక్ష్యంతో ప్రభుత్వం ఈ మార్పులను తీసుకువచ్చింది. ప్రస్తుతం ఉన్న 'సేల్స్ టాక్స్ కమిషనర్' పోస్టు పేరును ఇకపై 'చీఫ్ కమిషనర్ ఆఫ్ స్టేట్ టాక్స్'గా మార్చారు. అలాగే.. అదనపు కమిషనర్ (గ్రేడ్-1) హోదాను 'స్టేట్ టాక్స్ కమిషనర్'గా మారుస్తూ చట్ట సవరణ చేశారు. కేంద్ర ప్రభుత్వం, ఇతర రాష్ట్రాలలోని ఉన్నతాధికారుల హోదాలతో తెలంగాణ అధికారుల హోదాలను సమన్వయం చేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. ఈ బిల్లుపై చర్చ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. ఈ మార్పుల వల్ల రాష్ట్రానికి ఎలాంటి ఆర్థిక భారం గానీ, నష్టం గానీ ఉండదని స్పష్టం చేశారు. కేవలం పరిపాలనాపరమైన సౌలభ్యం, మెరుగైన కమ్యూనికేషన్ , సమన్వయం కోసమే ఈ చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. అధికారుల హోదాల్లో మార్పులు చేయడం ద్వారా జీఎస్టీ అమలులో ఎదురయ్యే టెక్నాలజీ పరమైన ఇబ్బందులను అధిగమించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. మంత్రి వివరణతో సంతృప్తి చెందిన సభ, చివరగా బిల్లుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

# బీజేపీకి బీఆర్ఎస్ భయపడింది..



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** బలహీనవర్గాల పక్షాన నిలడ్డ వ్యక్తి, తప్పును సరిచేయాలని ముందుకొచ్చిన వ్యక్తి రాహుల్ గాంధీ అని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ఇవాళ శాసనసభలో బీసీ రిజర్వేషన్ల అంశంపై చర్చ సందర్భంగా మాట్లాడిన ఆయన కలిసి పోరాటం చేయాలనుకుంటే మాతో కలిసి రావాలని విపక్షాలకు పిలుపునిచ్చారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో మేము ఢిల్లీలో పోరాటం చేస్తుంటే బీజేపీకి భయపడి బీఆర్ఎస్ మాతో కలిసి రాలేదని విమర్శించారు.

**పోరాటం చేశాం ఇంకా చేస్తూనే ఉంటాం:**

డెడికేషన్ కమిటీని ఏర్పాటు చేసి కోర్టు తీర్పుకు అనుగుణంగా ఒక ప్రయత్నం చేశామన్నారు. గతంలో రాహుల్ గాంధీ హైదరాబాద్‌లో పర్యటించిన సందర్భంగా బీసీ రిజర్వేషన్ల అంశంపై పోరాటం చేస్తామని చెప్పారు. అందుకోసం అనుగుణంగా మా ప్రయత్నం మేము చేశాం.
చేస్తూనే ఉంటామన్నారు. ఎన్డీయే కూటమి సభ్యులు సైతం రాష్ట్రపతి వద్దకు వెళ్లి బీసీ రిడర్వేషన్ల అంశంపై ప్రయత్నం చేశామన్నారు. అంతే తప్ప మా పోరాటాన్ని మా కమిట్‌మెంట్‌ను శంకించాల్సిన అవసరం లేదన్నారు.

# ప్రత్యేక శ్రద్ధ అవసరం...

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలోని ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య, పోషకాహారం అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రముఖ ఆర్థికవేత్త కార్తీక్ మురళీధరన్ రాష్ట్ర శాసన మండలి హాల్‌లో ముఖ్యమంత్రితో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో పాటు సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో 0-10 ఏళ్లలోపు పిల్లల్లో పోషకాహార లోపం, విద్యాభ్యాస స్థాయి సామర్థ్య లోపాలకు సంబంధించిన పలు నివేదికలను కార్తీక్ మురళీధరన్ దృష్టికి తెచ్చారు. చిన్న వయసులో పోషకాహార లోపం వల్ల భవిష్యత్తులో తలెత్తే ఆరోగ్య సమస్యలు, ప్రాథమిక స్థాయిలో సరైన బోధన లభించకపోతే విద్యార్థి భావి జీవితంలో పడే మానసిక వేదనను ఆయన వివరించారు. వాటిని అధిగమించడానికి తీసుకోవాల్సిన అంశాలను సూచించారు.

**ప్రత్యేక శ్రద్ధ అవసరం...**

ఆయా అంశాలపై తాము ఇప్పటికే ప్రత్యేక శ్రద్ధ పెట్టామని ముఖ్యమంత్రి తెలిపారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంతో పాటు అల్పాహారం అందించేందుకు బడ్జెట్‌లో కేటాయింపులు చేసినట్లు వివరించారు. అంగన్‌వాడీల్లో కార్యకర్తలు, ఆయాలతో పాటు పోషకాహారం అందించేందుకు అదనంగా మరొకరిని నియమించాలని కార్తీక్ మురళీధరన్ సూచించారు. అంగన్‌వాడీల్లో పిల్లలకు




పోషకాహారం అందించేందుకు "పోషణ సఖి" పేరుతో మరొకరిని నియమించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. కార్తీక్ మురళీధరన్ సూచించిన అంశాలను కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ పరిధిలోని 29 స్కూల్ కాంప్లెక్స్‌లలో ప్రయోగాత్మకంగా అమలు చేసే అవకాశాలను పరిశీలించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. కార్తీక్ మురళీధరన్‌తో సమన్వయం చేసుకుని ఈ అంశంపై ప్రత్యేక నివేదిక రూపొందించి సమర్పించాలని అధికారులను ఆదేశించారు.

## సంపాదకీయం

# విద్యార్థుల పై కార్పొరేట్ వల!

ఉమ్మడి జిల్లాలో పదో తరగతి పరీక్షలే పూర్తి కాకముందే విద్యార్థులకు కార్పొరేట్ కళాశాలలు వల వేస్తున్నాయి. ఓ వైపు విద్యార్థులు పరీక్షలు రాస్తుండగానే ఐఐటీ, నీట్, స్టేట్ ఎంట్రెన్స్‌లకు కోచింగ్ ఇస్తామని, తమకు జాతీయ-స్థాయిలో ర్యాంకులు వచ్చాయని తల్లిదండ్రులను బుట్ట వేసుకుంటున్నారు. రోజుల తరబడి వారికి కౌన్సెలింగ్ ఇస్తూ విద్యార్థులను చేర్చుకుంటున్నారు. ఇంటర్మీడియట్ అడ్మిషన్ ప్రక్రియ మొదలు కాకముందే సీట్లను భర్తీ చేస్తున్నారు. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పీఆర్వోలను నియమించి సీట్లను భర్తీ చేస్తున్నారు. కనీస వసతులు లేని కళాశాలల్లో విద్యార్థులను కుక్కుతూ కోట్ల రూపాయల వ్యాపారం చేస్తున్నారు. ఒక కళాశాల అనుమతి తీసుకొని బ్రాంచీలు పెట్టి అధికారులను మేనేజ్ చేస్తూ వందలాది మంది విద్యార్థులను చేర్చుకుంటున్నారు. కళ్ల ముందే అడ్మిషన్ ప్రక్రియ జరుగుతున్నా ఇంటర్మీడియెట్ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు.

**నిబంధనలకు నీళ్లు..**

రాష్ట్రంలో ప్రభుత్వం అనుమతి తర్వాతనే ఇంటర్‌మొదటి సంవత్సరం అడ్మిషన్లు చేయాలి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం విద్యార్థులను చేర్చుకోవాలి. నోటిఫికేషన్ ఇచ్చిన తర్వాత దరఖాస్తులను స్వీకరించి సీట్లను భర్తీ చేయాలి. ప్రస్తుతం పదో తరగతి పరీక్షలు కొనసాగుతున్నాయి. ఈ లోపే కార్పొరేట్ జూనియర్ కళాశాలల అడ్మిషన్లు జరుగుతున్నాయి. గడిచిన 15 రోజులుగా పదవ తరగతి పరీక్షలు రాసే పిల్లల చుట్టూ కార్పొరేట్ కళాశాలల పీఆర్వోలు తిరుగుతున్నారు. కళాశాలల నుంచి నిత్యం తల్లిదండ్రులకు ఫోన్లు చేయడంతో పాటు తమ కళాశాలల్లో చేరితే ఫీజు తగ్గింపు చేస్తామని ఐఐటీ, నీట్, ఎంసెట్ ఇతర కోచింగ్ లు అందిస్తామని ఆశలు కల్పిస్తున్నారు. విద్యార్థులను కౌన్సిలింగ్ చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని కార్పొరేట్ కళాశాలల్లో వందల మందిని చేర్చుకుంటున్నారు. పెద్ద ఎత్తున ప్రచారాలు నిర్వహిస్తున్నారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, సంఘాలతో పార్టీలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థుల వివరాలను తీసుకుంటున్నారు.

**రూ.లక్షల్లో ఫీజుల వసూళ్లు..**


ఉమ్మడి జిల్లాలో రాష్ట్రంలో పేరుపొందిన కార్పొరేట్ కళాశాలలు ఉన్నాయి. ర్యాంకులను ఎరవేస్తూ మీడియాలలో ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ కళాశాలలు అంతా చైన్ సిస్టమే పాటిస్తున్నారు. అడ్మిషన్ ప్రక్రియ అంతా ఉపాధ్యాయులు, సంఘాల నేతలు, పీఆర్వోల ద్వారా జరిగే విధంగా చూస్తున్నారు. ఎక్కడికక్కడ వారికి భారీ మొత్తంలో డబ్బులు ముట్టచెబుతున్నారు. ఆయా పాఠశాలల నుంచి తమ కళాశాలల్లో చేరే విధంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఒక్కోక్కరి నుంచి రెండేళ్లలో లక్షల ఫీజులు వసూలు చేస్తున్నారు. కళాశాలలో చేరినప్పుడే టీచింగ్, వసతి, పుస్తకాలు, లైబ్రరీ, హెల్త్ పేరు మీద డబ్బులు తీసుకుంటున్నారు. ఐఐటీ, నీట్, ఎంసెట్, ఇతర కోచింగ్ లకు అదనంగా వసూలు చేస్తున్నారు. స్మార్ట్ బ్యాచ్ లు, అడ్వాన్స్ బ్యాచ్ ల పేరున ఎక్కువ మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నారు.

**అనుమతులు నిల్.. అద్దెభవనాలు ఫుల్..**

ఉమ్మడి జిల్లా పరిధిలో కార్పొరేట్ కళాశాలలు కొన్నింటికే అనుమతులు తీసుకుని బ్రాంచ్ ల పేరిట ఎక్కువ మందిని చేర్చుకుంటున్నారు. అపార్ట్ మెంట్లు, భవనాలు అద్దెకు తీసుకొని తరగతులను నిర్వహిస్తున్నారు. రెసిడెన్షియల్ భవనాలనే వినియోగిస్తున్నారు. రెండేళ్ల పాటు విద్యార్థులు ఇరుకు గదుల్లో కుక్కి లక్షల్లో ఫీజులను వసూలు చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా ఇంటర్మీడియెట్ అధికారులు మాత్రం కార్పొరేట్ కళాశాలల వైపు చూడటం లేదు. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న బ్రాంచ్ లపై విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు ఫిర్యాదులు చేసినా పట్టింపు లేదు. దశాబ్దాల పాటు శాసిస్తున్న కార్పొరేట్ కళాశాలల వైపు తొంగి చూడటం లేదు. తమకున్న పలుకుబడితో కార్పొరేట్ యాజమాన్యాలు ఎవరిని ఆవైపు రానివ్వకుండా ప్రజాప్రతినిధులు, ఉన్నత స్థాయి అధికారుల ద్వారా మేనేజ్ చేస్తున్నారు. కార్పొరేట్ కళాశాలల నజరానాలు, కౌన్సిలింగ్ మాయలో పడి తల్లిదండ్రులు కూడా తమ పిల్లల్ని చేర్పిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న కార్పొరేట్ కళాశాలల పై అధికారులు దృష్టి పెడితే తల్లిదండ్రులకు మేలు జరిగే అవకాశం ఉంది.

---

# ప్రీతిరెడ్డి పొలిటికల్ ఎంట్రీ..!



ఆ మాజీ మంత్రి కుటుంబం నుంచి మరో పొలిటికల్ ఎంట్రీ ఉండబోతోందా? తన రాజకీయ వారసురాలిగా కోడల్ని బరిలో దింపాలనుకుంటున్నారా? నియోజకవర్గాల పునర్విభజన లెక్కలు కూడా ఆ ఫ్యామిలీకి కలిసి రాబోతున్నాయా? కానీ... అసలు ఎంట్రీ పాయింట్‌లోనే ఆ ఎక్స్ మినిస్టర్ కమ్ సిట్టింగ్ ఎమ్మెల్యే ట్విస్ట్ ఇవ్వబోతున్నారా? కోడల్ని తాను ఉన్న పార్టీ నుంచి కాకుండా పక్క పార్టీలో చేర్పించాలనుకుంటున్నారా? ఎవరా నేత? ఏంటా కథ? దేశవ్యాప్తంగా నియోజకవర్గాల పునర్విభజనకు లైన్ క్లియర్ అవుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. పునర్విభజన తర్వాతే ఈసారి ఎన్నికలు నిర్వహిస్తారన్న విషయంలో క్రమంగా క్లారిటీ వస్తోంది. ఈ క్రమంలోనే.... మాజీ మంత్రి మల్లారెడ్డి కుటుంబ సభ్యుల పొలిటికల్ ఎంట్రీ ఎపిసోడ్ ఆసక్తి రేపుతోంది. ప్రస్తుతం మేడ్చల్ బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉన్నారాయన. అదే పార్టీ నుంచి పక్కనే ఉన్న మల్కాజ్‌గిరి శాసనసభ్యుడిగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు మల్లారెడ్డి అల్లుడు మర్రి రాజశేఖర్‌రెడ్డి. అదంతా ఒక ఎత్తయితే... ఇప్పుడాయన కోడలు ప్రీతిరెడ్డి గురించిన చర్చలు విస్తృతంగా జరుగుతున్నాయి రాజకీయవర్గాల్లో. కుటుంబ, మల్లారెడ్డి విద్యాసంస్థల వ్యవహారాల్లో యాక్టివ్‌గా ఉంటున్న ప్రీతి రాజకీయాల మీద ఆసక్తిగా ఉన్నారు.గత పార్లమెంటు ఎన్నికల్లోనే మల్కాజ్‌గిరి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేయాలనుకున్నారామె. కుటుంబ సభ్యులున్న బీఆర్ఎస్ పార్టీ నుంచే ప్రీతి రెడ్డి కూడా పోటీ చేస్తారని అప్పట్లో ప్రచారం జరిగింది. ఒకవేళ గులాబీ పార్టీ నుంచి కుదరకపోతే కాషాయ కండువా కప్పుకుని కమలం గుర్తు మీద పోటీ చేస్తారని కూడా తీవ్రస్థాయిలో ప్రచారం జరిగింది. కానీ... అవేవీ వర్కౌట్ అవలేదు. ఇక ఇప్పుడు నియోజకవర్గాల పునర్విభజన కచ్చితంగా జరుగుతుందని అంటున్న క్రమంలో... ప్రీతిరెడ్డి యాక్టివిటీ మరోసారి చర్చల్లోకి వస్తోంది. అయితే... బీఆర్ఎస్ నుంచి కాకుండా బీజేపీ తరపునే ఈసారి ఆమెపోటీ చేయవచ్చన్న మాట గట్టిగా వినిపిస్తోంది.దానికి తోడు అసెంబ్లీ లాబీల్లో మీడియాతో మాట్లాడిన మల్లారెడ్డి కూడా తన కోడలు బీజేపీ నుంచి పోటీ చేసే అంశాన్ని కొట్టి పారేయలేదు. ఆమె బీఆర్ఎస్ నుంచి పోటీ చేస్తుందని చెప్పిన మల్లారెడ్డి.... ఒకవేళ కుదరకుంటే ఆమె వేరే పార్టీ నుంచి పోటీ చేస్తే నేనెలా అడ్డు చెప్పగలనని రివర్స్‌లో ప్రశ్నించారు. పార్టీ ఏదైనాసరే.... ఈసారి మాత్రం తన కుటుంబం నుంచి నలుగురు ఐదుగురు ప్రజాప్రతినిధులు ఉండడం ఖాయమని కూడా కుండబద్దలు కొట్టేశారాయన. దానికి తోడు తాను హిందుత్వవాదినని గతంలో ఒకటి రెండు సందర్భాల్లో చెప్పారు ప్రీతిరెడ్డి. అలాగే... తనకి ఇష్టమైన రాజకీయ నేత నరేంద్రమోడీ అని కూడా క్లారిటీ ఇచ్చేశారామె. దీంతో... మల్లారెడ్డి కోటలు బీజేపీ వైపు మొగ్గుతున్నట్టే కనిపిస్తోందని అంటున్నారు రాజకీయ పరిశీలకులు. అదే సమయంలో మల్లారెడ్డి కొడుకు భద్రారెడ్డి కూడా ఈసారి పోటీ చేస్తారని, నియోజకవర్గాల పునర్వనిభజన భార్యాభర్తలిద్దరికీ కలిసి వస్తుందన్న అంచనాలున్నాయి.భద్రారెడ్డి కూడా కుదిరితే బీఆర్ఎస్ లేదంటే బీజేపీ నుంచి బరిలో దిగవచ్చన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. అలాగే ఈసారి మహిళా రిజర్వేషన్ కోటా ప్రకారం సీట్లు ఉంటాయి కాబట్టి... తన కూతుర్ని కూడా రాజకీయ రంగంలోకి దింపేందుకు మల్లారెడ్డి సిద్ధమవుతున్నట్టు సమాచారం. ఆవిధంగా పార్టీ ఏదైనాసరే... ఒకే ఇంటి నుంచి ఐదుగురు నేతలు ఈసారి పోటీ చేసేందుకు సిద్ధవవుతున్నట్టు తెలుస్తోంది. ఒకే పార్టీ తరపున ఇంతమంది ఒకే కుటుంబ సభ్యులకు టిక్కెట్లు కుదరకపోవచ్చుకాబట్టి... బీఆర్ఎస్, బీజేపీ మధ్యనే ఉండవచ్చన్న ఊహాగానాలు పెరుగుతున్నాయి. మిగతా వాళ్ళ సంగతి ఎలా ఉన్నా... ప్రీతిరెడ్డి మాత్రం ఈసారి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తారని, అదీకూడా ఎక్కువ శాతం బీజేపీ చతరపునే ఉండవచ్చని అంటున్నాయి మల్లన్న సన్నిహిత వర్గాలు. కుటుంబ సభ్యులందరూ ఒకే పార్టీలో ఉండాలని రూల్ ఏమైనా ఉందా అని మల్లారెడ్డి వేసిన రివర్స్ క్వశ్చన్ ఆయన మనసులో ఏముందో చెప్పకనే చెప్పినట్టయిందనిన విశ్లేషణలు సైతం ఉన్నాయి. చివరికి ఎవరు ఏ పార్టీ వైపు మొగ్గుతారో చూడాలి.

# నియమమే నిచ్చెన.. క్రమశిక్షణే గమ్యం

తెలంగాణ సివిల్ సర్వీసెస్ (వర్గీకరణ, అప్పీల్) నిబంధనలు, 1991. దీన్ని సాధారణంగా జజూ నిబంధనలని మన వాడుక భాషలో పిలుస్తారు. రాష్ట్ర ప్రభుత్వంలో క్రమశిక్షణను, పరిపాలనా సమగ్రతను కాపాడడానికి ఇవి చట్టపరమైన వెన్నెముకగా పనిచేస్తాయి. ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి న్యాయమైన ట్రీట్‌మెంట్ అందుతుందని నిర్ధారిస్తూనే వారి చర్యలకు వారిని బాధ్యులను చేసే ప్రవర్తన నియమావళి మాన్యువల్‌గా దీన్ని మనం భావించవచ్చు. ఈ సీసీఏ రూల్స్‌లో తరచుగా కొంత పదజాలాన్ని అంటే ఎంక్వయిరీ ఆఫీసర్, ప్రజెంటింగ్ ఆఫీసర్, ఎంక్వయిరీ రిపోర్ట్, మేజర్ పెనాల్టీలు, మైనర్ పెనాల్టీలు మొదలైన వాటి గురించి వింటుంటాము. వాటిలో కొన్నిటి గురించి అవగాహన కోసం...

**విచారణాధికారి నియామకం:**

ప్రభుత్వ ఉద్యోగి క్రమశిక్షణ అధికారి ఎదుట హాజరై తనపై మోపబడిన ఆరోపణలను అంగీకరించ నప్పుడు లేదా సమాధానం చెప్పడానికి నిరాకరించి నప్పుడు లేదా విస్మరించి నప్పుడు, సంబంధిత క్రమశిక్షణ అధికారి ఆ విషయాన్ని రికార్డు చేసి ప్రభుత్వ ఉద్యోగి సంతకాన్ని తీసుకోవాలి. ఆపై సదరు అధికారి విచారణను తానే స్వ-యంగా నిర్వహించవచ్చు లేదా అవసరాన్ని భావిస్తే విచారణ జరిపేందుకు ఒక సర్వీస్‌లో ఉన్న లేదా రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగిని విచారణ అధికారిగా నియమించవచ్చు.

**ముఖ్య గమనికలు**

టీఎస్ సివిల్ సర్వీసెస్ సిసిఏ నిబంధనలు 1991 ప్రకారం క్రమశిక్షణ అధికారి స్వయంగా విచారణ జరిపేందుకు అనుమతి ఉన్నప్పటికీ, సాధారణంగా మరొక అధికారిని విచారణ అధికారిగా నియమించడం పరిపాటి. విచారణాధికారిగా ఎంపికయ్యే వ్యక్తి తగినంత సీనియర్ హోదాలో ఉండాలి. చార్జ్ చేయబడిన ప్రభుత్వ ఉద్యోగి పట్ల సదరు అధికారికి ఎటువంటి ముందస్తు పక్షపాతం లేదా వివక్ష ఉండకూడదు. గతంలో ఆ కేసు విషయంలో సదరు అధికారి ఎటువంటి అభిప్రాయాన్ని వ్యక్తం చేసి ఉండకూడదు. ఆరోపణల యొక్క తీవ్రతను అనుసరించి విచారణ అధికారిగా తన శాఖ యందలి సీనియర్ అధికారిని లేదా కమిషనరేట్ ఆఫ్ ఎంక్వైరీ చైర్మన్ లేదా అందులోని సభ్యులను కూడా నియమించవచ్చు. అయితే వారు సర్వీస్ లో ఉన్న లేదా రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి అయి ఉండాలి.

**విచారణాధికారి విధులు**

విచారణ అధికారి విచారణ యొక్క తేదీ మరియు సమ-యాన్ని ఖరారు చేయాలి మరియు ఆ విషయాన్ని నిందితుడికి అలాగే ప్రాసిక్యూషన్ సాక్షులకు తగిన సమాచారం ద్వారా తెలియజేయాలి. విచారణ అధికారి అవసరమైతే నిందితుని సౌకర్యాన్ని పరిగణలోకి తీసుకొని, విచారణ వేదికను కూడా ఎంచుకోవచ్చు. అయితే విచారణ అధికారి స్వయంగా వేదికను ఎంచుకోవడం వల్ల విచారణ చెల్లకుండా పోతుందని గాని, అది సహజ న్యాయ సూత్రాలను ఉల్లంఘిస్తుంది కానీ అర్థం కాదు. ఉద్యోగిపై విచారణ ఎక్కడ జరగాలని దానిపై కచ్చితమైన నిబంధనలు ఏమీ లేవు. విచారణ అధికారి స్వయంగా వేదికను ఎంచుకోవడం వల్ల ఉద్యోగి తనను తాను రక్షించుకునే అవకాశాన్ని ఏ రకమైన కోల్పోయాడా లేదా అనేది మా-త్రమే ఇక్కడ చూడాలి. విచారణ అధికారి రక్షణ సాక్షులను పేర్కొనమని నిందితుని అడగవచ్చు. అలాగే నిందితులు సాక్షులను పేర్కొన్నప్పుడు విచారణ అధికారి వారికి సమన్లు జారీ చేయాలి.

**నివేదిక అధికారి (ప్రెజెంటింగ్ Officer)**

క్రమశిక్షణ అధికారి విచారణ అధికారి ముందు ఆరోపణలు రుజువు చేయడానికి తన తరపున వాదించేందుకు ఒక ప్రభుత్వ ఉద్యోగిని లేదా న్యాయవాదిని ప్రజెంటింగ్ ఆఫీసర్‌గా నియమించవచ్చు. సాధారణంగా ఆ శాఖకు చెందిన, ఆ కేసుకు సంబంధించిన విషయాలపై అవగాహన ఉన్న ఒక ప్రభుత్వ ఉద్యోగిని ప్రజెంటింగ్ ఆఫీసర్ గా నియమిస్తారు. అయితే సంక్లిష్టమైన చట్టపరమైన అంశాలు ఉన్న సందర్భాల్లో మాత్రం న్యాయవాదిని కూడా నియమించడం ఉత్తమం అని భావించవచ్చు.

ముఖ్యమైన నియమాలు: 1. హోదా: ప్రజెంటింగ్ ఆఫీసర్ ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రభుత్వ ఉద్యోగి కంటే పై హోదాలో ( సీనియర్ )ఉండాలి. 2. నిష్పాక్షికత: ఈ కేసుకు సంబంధించి ప్రాథమిక విచారణ చేసిన అధికారిని ప్రజెంటింగ్ ఆఫీసర్‌గా నియమించకూడదు. ఎందుకంటే అతనిపై పక్షపాత ఆరోపణలు వచ్చే అవకాశం ఉంటుంది. 3. నిర్దేశించిన విచారణ పద్ధతులు సరిగ్గా పాటించేలా ప్రజెంటింగ్ ఆఫీసర్ చూసుకోవాలి. 4. విచారణ అధికారి ప్రవర్తనలో ఏవైనా అక్రమాలు లేదా పక్షపాతం కనిపిస్తే వెంటనే లిఖితపూర్వకంగా అభ్యంతరాలను తెలియజేయాలి. ఆ విషయాన్ని క్రమశిక్షణ అధికారికి నివేదించాలి. ప్రజెంటింగ్ ఆఫీసర్‌కు అవసరమైన అన్ని పత్రాలు, రికార్డుల కాపీలను అందించాలి. కొన్ని సందర్భాల్లో అసలు పత్రాలను కూడా అతని వద్ద ఉంచవచ్చు. 5. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగి సమర్పించిన రక్షణ పత్రాన్ని ప్రజెంటింగ్ ఆఫీసర్ జాగ్రత్తగా పరిశీలించాలి. ఒకవేళ ఆ ఉద్యోగి కొన్ని వాస్తవాలను అంగీకరించినట్లయితే ఆ వివరాలను జాబితా చేసి విచారణ అధికారి దృష్టికి తీసుకెళ్లాలి. దీనివల్ల ఇప్పటికే అంగీకరించిన విషయాలను మళ్లీ సాక్షాలతో నిరూపించాల్సిన అవసరం ఉండదు.

---

# గ్యాస్‌కు ప్రత్యామ్నాయం వస్తోందా?

యుద్ధ ప్రభావం భారత్ వరకు చేరడానికి ప్రధాన కారణాలలో ఒకటి ఎల్‌పీజీ కొరత.దీనివల్ల అనేకచోట్ల మెస్‌లు మూతపడ్డాయి, రెస్టారెంట్ల మెనూలు మారిపోయాయి, టీ, కాఫీలు కూడా దొరకని పరిస్థితి ఏర్పడింది.ఎల్‌పీజీ కోసం భారత్ ఇతర దేశాలపై ఆధారపడటమే దీనికి ప్రధాన కారణం.పుణెలోని నేషనల్ కెమికల్ లేబొరేటరీ శాస్త్రవేత్తలు దీనికి పరిష్కారాన్ని కనుగొన్నారు. 'డై మిథైల్ ఈథర్' అనే కృత్రిమ ఇంధనాన్ని ఎన్‌సీఎల్ శాస్త్రవేత్తలు తయారు చేశారు.గత 20 ఏళ్లుగా ప్రయోగాలు చేసి వారు ఈ ఇంధనాన్ని రూపొందించారు. ఎల్‌పీజీకి ప్రత్యామ్నాయంగా నిలిచే ఈ ఇంధనాన్ని భారీ స్థాయిలో ఉత్పత్తి చేసేందుకు శాస్త్రవేత్తలు ప్రస్తుతం కృషి చేస్తున్నారు.

**భారత్‌లో అందుబాటులో ఉన్న పదార్థాలతోనే..**

డై మిథైల్ ఈథర్ అనేది ఒక కృత్రిమ ఇంధనం. దీనిని రసాయనిక ప్రక్రియ ద్వారా తయారు చేస్తారు. గత 20 ఏళ్లుగా ఎన్‌సీఎల్ డైరెక్టర్ డాక్టర్ ఆశిష్ లేలే, డాక్టర్ తిరుమలైస్వామి రాజా దీనిపై పరిశోధనలు చేస్తున్నారు."మేం డైరెక్ట్ డీఎంఈ, ఇన్‌డైరెక్ట్ డీఎంఈ రెండింటినీ తయారు చేయడానికి ప్రయత్నించాం. దీనికి అత్యంత ముఖ్యమైనది ఉత్ప్రేరకం" అని డాక్టర్ తిరువ-ఎలైస్వామి రాజా తెలిపారు."భారత్‌లో అందుబాటులో ఉన్న పదార్థాలతోనే ఈ ఉత్ప్రేరకాన్ని తయారు చేశాం. నాలుగు రకాల ఉత్ప్రేరకాలను సిద్ధం చేసి, చివరికి దీనిని రూపొందించాం" అని తెలిపారు.డాక్టర్ ఆశిష్ లేలే మాట్లాడుతూ.. "100 శాతం డీఎంఈని ఉత్పత్తి చేయడంలో సహాయపడే ఉత్ప్రేరకాన్ని తయారు చేయడమే మా లక్ష్యం. దీనికి కావాల్సిన అన్ని వనరులు భారత్‌లోనే ఉన్నాయి. ఏదీ దిగుమతి చేసుకోవాల్సిన అవసరం లేదు. సుమారు 10 బార్ పీడనం తట్టుకునేలా ఈ ఉత్ప్రేరకం తయారవుతుంది. ఇది చాలా దృఢంగా ఉంటుంది" అని పేర్కొన్నారు.

**ఆచరణలో క్లిష్టం**

డాక్టర్ ఆశిష్ వివరణ ప్రకారం, ఈ రసాయనిక ప్రక్రియను అర్థం చేసుకోవడం చాలా సులభం. రెండు మిథనాల్ అణువులను కలిపి, వాటి నుంచి ఒక నీటి అణువును వేరు చేస్తే మిగిలేదే 'డై మిథైల్ ఈథర్'.అయితే, సిద్ధాంతపరంగా సులభంగా అనిపించినా, ఈ ప్రక్రియను ఆచరణలో పెట్టడం క్లిష్టమైన పని."మొదట మిథనాల్‌కు ఉత్ప్రేరకాన్ని జోడించినప్పుడు రసాయనిక చర్య జరిగి డీఎంఈ తయారవుతుంది. అయితే, చిన్న స్థాయిలో విజయవంతమైన ఈ ప్రక్రియను భారీ స్థాయిలో చేపట్టినప్పుడు కూడా అదే ఫలితం వస్తుందా? అనేది ప్రధాన ప్రశ్న. ఇందుకోసం మేం వేర్వేరు పరిమాణాల్లో డీఎంఈని తయారు చేసి చూశాం. ఈ ప్రయోగం కూడా సక్సెస్ అయ్యింది" అని డాక్టర్ ఆశిష్ వివరించారు.

**'స్వచ్ఛ ఇంధనం'**

ప్రస్తుత రూపంలో ఉన్న డీఎంఈని గ్యాస్ స్టవ్‌కు అనుసంధానించి వెలిగిస్తే, మంటలు కూడా కనిపించనంత స్వచ్ఛంగా ఈ ఇంధనం మండుతుంది. ఇది పొగ, నైట్రోజన్ ఆక్సైడ్లు, సల్ఫర్ ఆక్సైడ్లు, సూక్ష్మ కణాల ఉద్గారాలను గణనీయంగా తగ్గిస్తుంది.దీంతో పాటు, దీని ఉష్ణ సామర్థ్యం సంప్రదాయ ఇంధనాలతో సమానంగా ఉంటుంది. అందుకే ఇది ఒక ప్రభావవంతమైన ప్రత్యామ్నాయంగా మారుతుంది. పర్యావరణ దృష్ట్యా కూడా ఈ ఇంధనం చాలా అనుకూలమైనది."మనం ఇంట్లో వాడే ఎల్‌పీజీ స్టవ్‌లలో కార్బన్ పేరుకుపోతుంటుంది. ఆ కార్బన్‌ను మనం ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాల్సి ఉంటుంది. కానీ, డీఎంఈ విషయంలో మాత్రం అలాంటిదేమీ జరగదు. ఇది అత్యంత స్వచ్ఛంగా మండుతుంది, ఎంతలా అంటే దాని మంటలు కూడా మనకు స్పష్టంగా కనిపించవు" అని డాక్టర్ ఆశిష్ వివరించారు.

ఎన్‌సీఎల్ అభివృద్ధి చేసిన ఈ సాంకేతికత పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో కూడుకున్నది. దీని కోసం ఉపయోగించే ఉత్ప్రేరకం కూడా ఎంతో ఆదాను ఇస్తుంది.డాక్టర్ తిరువ-ఎలైస్వామి రాజా ఈ ఉత్ప్రేరకం కోసం ప్రత్యేకంగా ఒక రియాక్టర్‌ను కూడా సిద్ధం చేశారు. ఇదే ఈ సాంకేతికతలోని ప్రధాన ప్రత్యేకత. ప్రస్తుతం ఉన్న ప్లాంట్‌లో రోజుకు 12 నుంచి 13 కిలోల డీఎంఈ త-యారవుతోంది. అయితే, ప్రస్తుతం రోజుకు 250 కిలోల ఇంధనాన్ని ఉత్పత్తి చేయగల సామర్థ్యం ఉన్న ప్రాజెక్టును నిర్మిస్తున్నారు.

**'దిగుమతులపై ఆధారపడటం తగ్గుతుంది'**

ఎన్‌సీఎల్ శాస్త్రవేత్తల అభిప్రాయం ప్రకారం, ప్రస్తుతం తక్కువ పరిమాణంలో డీఎంఈ తయారవుతున్నప్పటికీ, ఎల్‌పీజీపై భారత్ ఆధారపడటాన్ని తగ్గించడంలో ఇది పెద్ద ఊరటనిస్తుంది.ఎన్‌సీఎల్‌లో ప్రస్తుతం సిద్ధం చేసిన ప్రోటోటైప్, 100 శాతం ఎల్‌పీజీ లేదా 100 శాతం డీఎంఈతో కూడా పనిచేయగలదు. బెంగళూరులోని 'ఎల్‌పీజీ ఎక్విప్‌మెంట్ రీసెర్చ్ సెంటర్' లో దీనిని ఇప్పటికే పరీక్షించారు. ఈ సాంకేతికత ద్వారా కేవలం 10 బార్ పీడనం వద్దే డీఎంఈని తయారు చేయవచ్చు. దీనిని నేరుగా ఎల్‌పీజీ సిలిండర్లలో నింపవచ్చు."ఎల్‌పీజీ ఎలాగైతే ద్రవ రూపంలోకి మారుతుందో, డీఎంఈ కూడా అలాగే మారుతుంది. 7 బార్ పీడనం వద్ద డీఎంఈ ద్రవంగా మారుతుంది, ఇది ఎల్‌పీజీలో పూర్తిగా కలిసిపోతుంది" అని డాక్టర్ ఆశిష్ తెలిపారు."ప్రస్తుతం ఎల్‌పీజీలో 8 శాతం డీఎంఈని కలిపి ప్రయోగాత్మకంగా పరిశీలించాం. ఇలా 8 శాతం కలిపిన ఇంధనాన్ని ప్రస-ుతమున్న స్టవ్‌లు, సిలిండర్లలోనే నేరుగా వాడుకోవచ్చు. మన మొత్తం ఎల్‌పీజీ వినియోగంలో 8 శాతం అంటే, అది దిగుమతులపై చూపే ప్రభావం చాలా ఎక్కువగా ఉంటుంది. మొదట 8 శాతంతో ప్రారంభించి, భవిష్యత్తులో దీనిని 20 శాతం వరకు పెంచవచ్చు" అన్నారు ఆశిష్.

**ఆర్థికంగా దేశానికి ఊరట**

భారత్ 2024లో 21 మిలియన్ టన్నుల ఎల్‌పీజీని దిగుమతి చేసుకుంది. ఇందులో కేవలం 8 శాతం డీఎంఈ కలిపినా ఏటా వేలాది కోట్ల రూపాయల విదేశీ మారక ద్రవ్యం ఆదా అవుతుంది.శాస్త్రవేత్తలు చెబుతున్న దాని ప్రకారం, ప్రధానమంత్రి ఉజ్వల యోజన కింద ఉన్న 10.5 కోట్ల గ్యాస్ కనెక్షన్ల కోసం 8 శాతం డీఎంఈని ఉపయోగిస్తే, రోజుకు 1,300 టన్నుల డీఎంఈ ఉత్పత్తి అవసరం. దీనిని ఎల్‌పీజీలో కలిపి ఉపయోగించడం వల్ల వినియోగదారులు ప్రత్యేకంగా కొత్త స్టవ్‌లు లేదా సిలిండర్లు కొనాల్సిన అవసరం లేదు.అనేక దేశాల్లో ఇప్పుడే డీఎంఈని తయారు చేస్తున్నారు కానీ, అక్కడ దీనిని పర్యావరణహిత ఉత్పత్తులైన డియోడరెంట్లు లేదా ఇతర రంగాల్లో ఉపయోగిస్తున్నారు.

అయితే, ఆ తయారీ సాంకేతికతను ఏ దేశం కూడా బయటకు వెల్లడించడం లేదు.ఇప్పుడు భారత్ సొంతంగా ఉత్ప్రేరకాన్ని, డీఎంఈ తయారీ విధానాన్ని అభివృద్ధి చేసింది. దీనికి సంబంధించిన ప్లాంట్‌ను కూడా ఏర్పాటు చేశారు.నేషనల్ కెమికల్ లాబొరేటరీ ప్రస్తుతం ఒక ఇంజనీరింగ్ భాగస్వామితో కలిసి రాబోయే 6 నుంచి 9 నెలల్లో రోజుకు 2.5 టన్నుల సామర్థ్యం గల పారిశ్రామిక ప్రదర్శన ప్రాజెక్టును చేపట్టేందుకు సిద్ధమవుతోంది. ఈ ప్రాజెక్ట్ విజయవంతమైతే, రోజుకు 500 నుంచి 1,000 టన్నుల సామర్థ్యం గల వాణిజ్య ప్లాంట్ల ఏర్పాటుకు మార్గం సుగమం అవుతుంది.



# ఇరాన్ సంచలన ప్రకటన..




**ఇరాన్ :** మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు ఇప్పుడు ప్రపంచ చమురు మార్కెట్‌పై నేరుగా ప్రభావం చూపుతున్నాయి. తాజాగా శాంతి ఆశలకు పెద్ద ఎదురుదెబ్బ తగలడంతో ముడి చమురు ధరలు మరోసారి భారీగా పెరిగాయి. గురువారం, బ్రెంట్ క్రూడ్ ధర 103 డాలర్లను అధిగమించి, మార్కెట్‌లో కలకలం రేపింది. గత కొన్ని రోజులుగా చమురు మార్కెట్‌లో గణనీయమైన అస్థిరత కనిపిస్తోంది. తాజాగా చమురు ధరలు పెరుగుదలకు ప్రధాన కారణం అమెరికాతో ప్రత్యక్ష చర్చలకు ఇరాన్ నిరాకరించడమేనని నిపుణులు చెబుతున్నారు. మార్చి 26, గురువారం నాడు ముడి చమురు ధరలు 1% కంటే ఎక్కువగా పెరిగాయి. ప్రపంచ బెంచ్‌మార్క్ బ్రెంట్ ముడి చమురు బ్యారెల్‌కు సుమారు $103.46కు చేరుకోగా, యూఎస్ డబ్ల్యూటీఐ ముడి చమురు బ్యారెల్‌కు సుమారు $91.54 వద్ద ట్రేడవుతోంది. కొన్ని రోజుల క్రితం ధరలు తగ్గినప్పటికీ.. ఇప్పుడు మళ్లీ పుంజుకోవడంతో పెట్టుబడిదారులలో అనిశ్చితి నెలకొంది. చమురు ధరల పెరుగుదలకు అతిపెద్ద కారణం ఇరాన్ చేసిన ఓ సంచలన ప్రకటన. అమెరికాతో ఎలాంటి ప్రత్యక్ష చర్చలను ఆ దేశం ఖచ్చితంగా తిరస్కరించింది. కొన్ని దేశాల ద్వారా సందేశాలు పంపుకుంటున్నప్పటికీ, దీనిని ప్రత్యక్ష చర్చలుగా పరిగణించలేమని ఇరాన్ విదేశాంగ మంత్రి పేర్కొన్నారు. గత అనుభవాన్ని ఉటంకిస్తూ, గతంలో చర్చల సమయంలో దాడులు జరిగాయని, అందువల్ల ప్రస్తుతం ప్రత్యక్ష చర్చలకు ఎలాంటి ప్రణాళికలు లేవని అన్నారు. ఇరాన్ చర్చలకు నిరాకరిస్తుండగా, ఇరు దేశాల మధ్య చర్చలు కొనసాగుతున్నాయని, సానుకూల దిశలో సాగుతున్నాయని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేర్కొన్నారు. అయితే, ఇరు దేశాల నుంచి వస్తున్న విభిన్న ప్రకటనలు మార్కెట్‌లో గందరగోళాన్ని సృష్టిస్తూ, పెట్టుబడిదారుల విశ్వాసాన్ని దెబ్బతీస్తున్నాయి.



# కౌలుదారులొచ్చి కాంగ్రెస్‌ను నాశనం చేసింద్రు..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆర్మూర్ బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి మరోసారి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇవాళ ఆసెంబ్లీ ఆవరణలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఉత్తర తెలంగాణలో కల్తీ కల్లు మరణాలు, గల్ఫ్ కార్మికుల సమస్యలు, ప్రభుత్వ పథకాలకు పెడుతున్న పేర్లపై దుమ్మెత్తిపోశారు. ఉత్తర తెలంగాణలో ఆల్‌ప్రాజోలం కల్తీ కల్లు వల్ల ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కల్తీ లేని ఉత్తర తెలంగాణను నిర్మించాలని డిమాండ్ చేస్తూనే.. మద్యం బ్రాండ్లలాగే ఇప్పసారాకు పింక్ లేబుల్ వంటి పేర్లు పెట్టి ప్రభుత్వమే సరఫరా చేయాలని ఎద్దేవా చేశారు.

**ఇందిరమ్మ పేరుపై అభ్యంతరం..**

ప్రతి పథకానికి మాజీ ప్రధాని ఇందిరా గాంధీ పేరు పెట్టడం ద్వారా ఆమెను అవమానించవద్దని రాకేష్ రెడ్డి హితవు పలికారు. సోషల్ మీడియాలో ఆమెపై వస్తున్న అభ్యంతరకర వీడియోలను ఖండించిన ఏకైక ఎమ్మెల్యేను తానేనని గుర్తు చేశారు. ప్రభుత్వ పథకాలకు తెలంగాణ అమరవీరుల పేర్లు, మాజీ సీఎంల పేర్లు మీకు దొరకడం లేదా అని ప్రశ్నించారు. సోనియా గాంధీని బలిదేవత అన్న వ్యక్తే ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలో సీఎం అయ్యారని కామెంట్ చేశారు. 40 ఏళ్లుగా పార్టీకి సేవ చేసిన జీవన్ రెడ్డి వంటి నేతలను అవమానిస్తూ బయటకు పంపుతున్నారని మండిపడ్డారు. కౌలుదారులు వచ్చి కాంగ్రెస్‌ను నాశనం చేస్తున్నారని.. నిన్న రాజీనామా చేస్తున్న నేపథ్యంలో జీవన్ రెడ్డి మాటలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. చనిపోయిన 120 మంది గల్ఫ్ కార్మికుల కుటుంబాలకు ఇంకా పరిహారం అందలేదని, వారు సచివాలయం చుట్టూ తిరుగుతున్నా ప్రభుత్వానికి కనికరం లేదని ధ్వజమెత్తారు. బడ్జెట్‌లో గల్ఫ్ సంక్షేమ నిధికి రూ.1000 కోట్లు కేటాయించాలని రాకేశ్ రెడ్డి డిమాండ్ చేశారు.

# ఫ్లై యాష్ వినియోగంలో తెలంగాణ వెనుకంజ

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** థర్మల్ పవర్ ప్లాంట్లలో బొగ్గును మండించడం ద్వారా ఉత్పత్తి అయ్యే ఫ్లై యాష్(బూడిద)ను ఒకప్పుడు వ్యర్థంగా పరిగణించేవారు. కాలక్రమేణా ఇది నిర్మాణ రంగానికి కీలక ముడి సరుకుగా, పర్యావరణ పరిరక్షణకు సహాయపడే వనరుగా, ప్రభుత్వాలకు ఆదాయాన్ని అందించే ఆర్థిక సంపదగా మారింది. దేశవ్యాప్తంగా బూడిదను సమర్థంగా వినియోగిస్తూ మౌలిక వసతుల అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుండగా, తెలంగాణ మాత్రం ఈ అవకాశాన్ని పూర్తి స్థాయిలో అందిపుచ్చుకోలేకపోతోంది. కేంద్ర ఎలక్ట్రిసిటీ అథారిటీ(సీఈఏ) విడుదల చేసిన తాజా నివేదిక ప్రకారం దేశం దాదాపు 96 శాతం బూడిదను వినియోగిస్తున్నప్పటికీ, తెలంగాణలో ఈ శాతం 76.57కే పరిమితమవడం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని థర్మల్ ప్లాంట్ల పనితీరు తక్కువగా ఉండటం, పరిశ్రమలతో సమన్వయం లోపించడం, రవాణా సమస్యలు వంటి కారణాలతో రాష్ట్రం జాతీయ సగటుతో పోలిస్తే గణనీయంగా వెనుకబడినట్టు నివేదిక స్పష్టం చేస్తోంది.

**తెలంగాణ పరిస్థితి ఇలా..**

రాష్ట్రంలో 10 థర్మల్ పవర్ ప్లాంట్లు ఉండగా, మొత్తం స్థాపిత సామర్థ్యం 9442.5 మెగావాట్లు. 2024–25లో 155.10 లక్షల మెట్రిక్ టన్నుల(ఎల్ఎంటీ) బూడిద ఉత్పత్తి కాగా.. అందులో కేవలం 118.77 ఎల్ఎంటీ మాత్రమే వినియోగించారు. రాష్ట్రంలో బూడిద మొత్తం వినియోగం 76.57 శాతం మాత్రమే. ఇది జాతీయ సగటుతో పోలిస్తే చాలా తక్కువ. దేశవ్యాప్తంగా 214 గిగావాట్ల సామర్థ్యం గల 189 థర్మల్ ప్లాంట్లలో మొత్తం బూడిద ఉత్పత్తి 3187.98 ఎల్ఎంటీ కాగా.. వినియోగం 3071.38 ఎల్ఎంటీగా ఉంది. వినియోగ శాతం 96.34 అంటే దేశం దాదాపు పూర్తి స్థాయిలో బూడిదను ఉపయోగించుకుంటోంది. తెలంగాణ మాత్రం జాతీయ సగటుతో పోలిస్తే ఎంతో వెనకబడిపోయి ఆర్థిక వనరును సద్వినియోగం చేసుకోలేకపోతోందని సీఈఏ నివేదిక వెల్లడించింది. జాతీయ సగటు కంటే తెలంగాణ 20 శాతం తక్కువగా ఉంది. రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని ప్లాంట్లలో వినియోగం కేవలం 68.87శాతమే ఉంటే.. రాష్ట్రంలోనే ఉన్న కేంద్ర ప్లాంట్లు(ఎన్టీపీసీ) మాత్రం 86.08 శాతంతో మెరుగ్గా ఉన్నాయి. రాష్ట్ర రంగంలోనే ప్రధాన లోపం కనిపిస్తోంది. ఆంధ్రప్రదేశ్, బిహార్, హర్యానా, పంజాబ్ వంటి రాష్ట్రాలు 100 శాతం బూడిద వినియోగంతో దూసుకుపోతున్నాయి. ఇవి పాత బూడిద(లెగసీ యాష్)నూ ఉపయోగించి ఆదర్శంగా నిలిచాయి. మొత్తం 13 రాష్ట్రాలు ఏటా 10 మిలియన్ టన్నుల కంటే ఎక్కువ బూడిదను ఉత్పత్తి చేస్తున్నాయి. ఇందులో ఛత్తీస్‌గఢ్ అత్యధికంగా 49.79 మిలియన్ టన్నుల బూడిదను ఉత్పత్తి చేస్తోంది.

**పిట్ హెడ్ వర్సెస్ నాన్ పిట్ హెడ్**

బొగ్గు గనుల సమీపంలో ఉండే ప్లాంట్లను పిట్ హెడ్ ప్లాంట్లు అని, దూరంగా ఉండే వాటిని నాన్–పిట్ హెడ్ అని అంటారు. పిట్ హెడ్ ప్లాంట్లలో వినియోగం 89.36 శాతంగా ఉంది. ఇక్కడ రోడ్ల నిర్మాణం(66శాతం) ప్రధాన వినియోగ మార్గంగా ఉంది. నాన్–పిట్ హెడ్ ప్లాంట్లలో 98.55 శాతంతో అత్యధిక వినియోగం కనిపిస్తోంది. ఇక్కడ సిమెంట్ తయారీ(35శాతం) ద్వారా బూడిద ఎక్కువగా వినియోగిస్తున్నారు.

**బూడిద ఉపయోగం ఎందుకు కీలకం?**

ఫ్లై యాష్ వినియోగం అనేక రంగాలకు కీలకంగా ఉంది. రోడ్ల నిర్మాణంలో బలమైన బేస్ మెటీరియల్‌గా బూడిద పనిచేస్తోంది. ఇటుకల తయారీలో మట్టి వినియోగం తగ్గించేందుకు, సిమెంట్ పరిశ్రమలో ఖర్చు తగ్గింపునకూ ఫ్లై యాష్ కీలకం. ఫలితంగా పర్యావరణ కాలుష్యం తగ్గింపునకు అవకాశం ఏర్పడుతుంది. అంటే ఇది వ్యర్థం కాదు విలువైన నిర్మాణ వనరు అని చెప్పవచ్చు.

దేశం, రాష్ట్రంలో బూడిద వినియోగం ఇలా..

తెలంగాణ దేశవ్యాప్తంగా
రోడ్లు 28.63% 34%
ఇటుకలు 28.21% 30%
సిమెంట్ 23.96% 28%

**రాష్ట్రం ఎందుకు వెనుకబడింది?**

బూడిదను ప్లాంట్ల నుంచి పరిశ్రమలకు తరలించేందుకు సరైన లాజిస్టిక్స్ లేకపోవడం రాష్ట్రంలో ప్రధాన సమస్యగా ఉంది. సిమెంట్, ఇటుక పరిశ్రమలతో సమన్వయం తక్కువగా ఉండటం కనిపిస్తోంది. కేంద్ర మార్గదర్శకాలు ఉన్నప్పటికీ, రాష్ట్ర స్థాయిలో కఠినంగా అమలు కాకపోవడం సమస్యగా మారింది. పాత బూడిద నిల్వలు ఎక్కువగా ఉండటం వల్ల వినియోగం మందగించింది. ఫ్లై యాష్ ప్రయోజనాలపై చిన్న పరిశ్రమలకు సరైన అవగాహన లేకపోవడం బూడిద వినియోగం తగ్గడానికి కారణాలు.

**సద్వినియోగం చేసుకోవాలంటే..**

సిమెంట్, రోడ్ల నిర్మాణ రంగాలతో ఒప్పందాలు పెంచాలి. బూడిద రవాణాకు సబ్సిడీలు ఇవ్వాలని కన్‌స్ట్రక్షన్ కంపెనీలు కోరుతున్నాయి. పాత బూడిద వినియోగంపై ప్రత్యేక ప్రణాళికలు అవసరమని నిపుణులు సూచిస్తున్నారు.

ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వ ప్లాంట్ల పనితీరును మెరుగుపరచాలి. సరైన విధానాలు, సమన్వయం ఉంటే బూడిద రాష్ట్ర అభివృద్ధికి బలమైన పునాది అవుతుందని నిపుణులు సూచిస్తున్నారు.

# వర్షాలకు టాటా..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలో గత వారం, పది రోజులుగా అకస్మాత్తుగా పడిన అకాల వర్షాలు టాటా చెప్పేసాయి. నేటి నుంచి ఎండాకాలపు సూర్యుడు డ్యూటీ ఎక్కనున్నాడు. భగ్గున మండే ఎండతో ప్రజలు అల్లాడిపోనున్నట్టు వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాల్లో ఉష్ణోగ్రతలు భారీగా పెరగనున్నాయి. ఆదిలాబాద్, కొమురం భీమ్ అసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, మంచిర్యాల, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 39°C నుండి 41°C వరకు నమోదయ్యే అవకాశం ఉంది. గాలిలో తేమ తగ్గడంతో పొడి వాతావరణం కారణంగా వేడి గాలులు వీచే అవకాశం ఉంది. అయినప్పటికీ ద్రోణి ప్రభావంతో వికారాబాద్, సంగారెడ్డి, రంగారెడ్డి, నారాయణపేట, ఆదిలాబాద్, అసిఫాబాద్ జిల్లాల్లో సాయంత్రం లేదా రాత్రి సమయాల్లో ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశం ఉందని చెబుతున్నారు. అలాగే రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలో ఉష్ణోగ్రతలు 38°C నుండి 39°C మధ్య రికార్డు అయ్యే అవకాశం ఉంది. అయితే నగరంలో సాయంత్రం వేళల్లో ఒకటి రెండు చోట్ల తేలికపాటి వర్షం కురిసే అవకాశం ఉందని, అయితే మిగిలిన సమయమంతా పొడి వాతావరణమే ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 4 గంటల వరకు ఎండ తీవ్రత అత్యధికంగా ఉంటుంది కాబట్టి ఈ సమయంలో అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లకపోవడం ఉత్తమం అని సూచిస్తున్నారు.



# ఆ గంట ఆగకుంటే ప్రాణాలు దక్కేవేమో!

**ఆంధ్రప్రదేశ్ :** వరుస రోడ్డు ప్రమాదాలు తెలుగు రాష్ట్రాలను భయపెడుతున్నాయి. ఇవాళ తెల్లవారుజామున ఏపీలోని మార్కాపురం జిల్లాలో హరికృష్ణ ట్రావెల్స్ కు చెందిన బస్సు, టిప్పర్ ఢీ కొట్టిన ఘటనలో 13 మంది సజీవ దహనం కాగా మరో 28 మందికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో కొందరి పరిస్థితి విషయమంగా ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఈ ప్రమాదం జరిగిన తీరు, ఘటన స్థలంలోని దృశ్యాలు భీతిగొల్పేలా ఉన్నాయి. ప్రమాదానికి గురైన బస్సు కండీషన్ విషయంలో ఇప్పుడు సంచలన విషయాలు వెలుగు చూస్తున్నాయి. బస్సు కండిషన్ బాగోలేదని మార్కాపురం జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు కీలక విషయాలు వెల్లడించారు. ప్రమాదం జరిగే సమయానికి గంట ముందు కూడా బస్సు ట్రబుల్ ఇచ్చిందని దాంతో గంట సేపు బస్సును నిలిపివేసి రిపేర్లు చేశారని ఆ తర్వాత ప్రయాణం మొదలైన కొద్దిసేపటికే ఈ ఘోరం జరిగినట్లు తెలిపారు. ఒక వేళ ఈ గంట సమయం ప్రయాణం కూడా సాఫీగా జరిగితే ఈ గండం నుంచి తమ వారు బయటపడేవారేమోనని బాధిత కుటుంబ సభ్యులు రోధిస్తున్నారు.

**సంక్రాంతి సమయంలోనే జరిమానా:**

ప్రమాదానికి గురైన హరికృష్ణ ట్రావెల్స్ బస్సు కండిషన్ బాగోలేదని రెండు నెలల క్రితం జరిగిన సంక్రాంతి పండగ సమయంలోనే బయటపడినట్లు తెలుస్తోంది. ఆర్టీఏ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో బస్సు కండీషన్ బాగోలేదని రూ.36 వేల జరిమానా విధించారని అధికారులు వెల్లడించారు. ఈ జరిమానాతోనైనా బస్సు కండీషన్ మెరుగు పరిచి ప్రయాణికుల భద్రతపై దృష్టి సారించి ఉంటే ఇవాళ ఈ ప్రమాదం జరిగి ఉండేది కాదేమో అని బాధితులు చెబుతున్నారు. కానీ కాసుల కక్కుర్తికి ప్రయాణికుల ప్రాణాలను పణంగా పెట్టి యాజమాన్యం కండీషన్ సరిగా లేకపోయినా, డ్రైవర్ల పట్ల సరైన నిఘా లేకుండా సర్వీసులు నడుపుతుండటంతో ఇవాళ 13 మంది నిండు ప్రాణాలు బూడిదపాలయ్యాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**కావేరీ ఘటన మరువక ముందే:**

తెలుగు రాష్ట్రాల్లో ఒక విషాదం నుంచి తేరుకోక ముందే మరో ఘోరం వెంటాడుతోంది. తాజాగా జరిగిన మార్కాపురం ఘటనకు ముందు గతేడాది అక్టోబర్ కర్నూల్ జిల్లాలో వేమూరి కావేరీ ట్రావెల్స్ బస్సు అగ్నిప్రమాదానికి గురై 20 మంది మాంసపు ముద్దలుగా మిగిలారు. ఈ ఘటనలోనూ కావేరీ ట్రావెల్స్ యాజమాన్యం నిర్లక్ష్యం నిండుగా కనిపించింది. సీటింగ్‌కు పర్మిషన్ తీసుకుని అక్రమంగా స్లీపర్‌గా మార్చి సర్వీసులు నడపడంతో ప్రమాదానికి గురైన సమయంలో బయటపడేందుకు వీలు లేక ప్రాణనష్టం పెరిగింది. ఇప్పుడు మార్కాపురం ఘటనలో బస్ ఫిట్‌నెస్ సరిగా లేకపోయినా సర్వీసులు నడుపుతుండటం రాష్ట్రంలోని ప్రైవేట్ ట్రావెల్స్ యాజమాన్యాల నిర్లక్ష్యంపై మరోసారి సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రమాదాలు జరిగినప్పుడే అధికారులు హడావుడి చేయకుండా నిత్యం తనిఖీలు చేసి సురక్షిత ప్రయాణానికి భరోసా కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

# రాష్ట్రానికి రూ.2.19 లక్షల కోట్ల పెట్టుబడులు..



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** 2024, 2025 దావోస్ పర్యటనల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం మొత్తంగా రూ.2.19 లక్షల కోట్ల పెట్టుబడులను సముపార్జించిందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. ఇవాళ సభలో దావోస్ పర్యటనలో భాగంగా రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులపై బీజేపీ సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం చెప్పారు. మొత్తం 44 ఎంవోయూలను వివిధ కంపెనీలతో కుదుర్చుకున్నామని పేర్కొన్నారు. ఆయా పెట్టుబడుల గ్రౌండింగ్ వివిధ దశల్లో ఉన్నాయని, ఫలితంగా కొత్తగా 68,150 మంది నిరుద్యోగులకు ప్రత్యక్షంగా ఉపాధి లభించనుందని తెలిపారు. 2024లో 18 ఎంవోయూ లతో రాష్ట్రానికి రూ.40,232 కోట్ల పెట్టుబడులు రాగా, 2025లో 26 ఎంవోయూలతో రూ.1,78,950 కోట్లు కలుపుకుని మొత్తం 44 ఎంవోయూలతో రూ.2,19,182 కోట్ల పెట్టుబడులు వచ్చాయని అన్నారు. అయితే, దావోస్ పర్యటనల్లో భాగంగా రూ.81,800 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు ఎంవోయూలు కుదుర్చుకున్న 6 కంపెనీలకు ఇప్పటికే భూములు కేటాయించామని చెప్పారు. ఈ ప్రక్రియ ద్వారా ప్రభుత్వానికి రూ.1,540 కోట్ల ఆదాయం సమకూరిందని వెల్లడించారు. ఇక నిజామాబాద్ ఐటీ టవర్ మొత్తం 681 సీట్ల సామర్థ్యం ఉందని, ప్రస్తుతం అక్కడ 11 కంపెనీలు 276 మంది ఉద్యోగులతో కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని మంత్రి శ్రీధర్ బాబు సభలో ప్రస్తావించారు.

# సజీవ దహనం



**ఆంధ్రప్రదేశ్ :** మార్కాపురం జిల్లా రాయవరం సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం విషాదాన్ని మిగిల్చింది.. టిప్పర్ మరియు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొనడంతో బస్సులో మంటలు చెలరేగి ప్రయాణికులు సజీవదహనం కావడం తీవ్ర కలకలం రేపింది.. ఈ ఘటనలో ఇప్పటి వరకు 13 మంది మృతిచెందారు.. మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు.. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందంటున్నారు వైద్యులు.. ఈ ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాద వివరాలను అధికారుల నుంచి తెలుసుకున్న ఆయన, గాయపడిన వారికి అందుతున్న వైద్యసాయంపై సమీక్షించారు. క్షతగాత్రులను తక్షణమే సమీప ఆసుపత్రులకు తరలించి అత్యుత్తమ చికిత్స అందించాలని ఆదేశించారు. అలాగే ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర విచారణ జరిపి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ ప్రమాదంపై విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ కూడా తీవ్ర విచారం వ్యక్తం చేశారు. బస్సులో ప్రయాణికులు సజీవదహనం కావడం ఎంతో బాధాకరమని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటుందని తెలిపారు. ఇక, వైసీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఈ ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ, గాయపడిన వారికి అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రమాదంపై ఆవేదన వ్యక్తం చేస్తూ, రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోవడం చాలా విషాదకరమని అన్నారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు ఆదేశించారు. విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ కూడా ఘటనపై స్పందిస్తూ, అధికారులతో మాట్లాడి సహాయ కార్యక్రమాలను వేగవంతం చేయాలని సూచించారు. క్షతగాత్రులకు తక్షణ వైద్యసాయం అందించాలని ఆదేశించారు. అదేవిధంగా మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి ప్రమాదంపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలియజేస్తూ, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ దుర్ఘటనపై రాష్ట్రవ్యాప్తంగా విషాద వాతావరణం నెలకొంది. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తక్షణ సహాయం అందించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## కంట్రోల్ రూమ్ ఏర్పాటు

ఆంధ్రప్రదేశ్ లోని మార్కాపురం జిల్లాలో పెను విషాదం చోటుచేసుకున్న విషయం తెలిసిందే. కంకర లోడుతో వెళ్తున్న టిప్పర్ ను ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు వేగంగా ఢీకొనడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ఘోర ప్రమాదంలో మొత్తం 13 మంది ప్రయాణికులు బస్సులోనే చిక్కుకుపోయి సజీవ దహనమయ్యారు. ఈ ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ప్రభుత్వం, సహాయక చర్యలను పర్యవేక్షించేందుకు, బాధిత కుటుంబాలకు సమాచారం అందించేందుకు తక్షణమే ప్రత్యేక కంట్రోల్ రూమ్ ను ఏర్పాటు చేసింది. ప్రమాదానికి గురైన వారి వివరాలు, ఇతర సమాచారం 6304285613, 9985733999, 7989537285, 9703578434 కోసం కింది ఫోన్ నంబర్లను సంప్రదించాలని అధికారులు పేర్కొన్నారు.

## బస్సు ప్రమాదంపై ప్రధాని మోడీ దిగ్భ్రాంతి..



ఆంధ్రప్రదేశ్ లోని మార్కాపురం జిల్లాలో జరిగిన ఘోర బస్సు ప్రమాదం లో 13 మంది ప్రాణాలు కోల్పోగా మరో 27 మందికి గాయాలు అయ్యాయి. వారిలో ఆరుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. కాగా ఈ ఘోర ప్రమాదంపా ప్రధాని నరేంద్ర మోడీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. "మార్కాపురంలో జరిగిన ప్రమాదం అత్యంత విషాదకరం. తమ ప్రియతములను కోల్పోయిన కుటుంబాలకు నా ప్రగాఢ సంతాపం. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను" అని ప్రధాని ట్విట్టర్ వేదికగా పేర్కొన్నారు. అలాగే బాధితులను ఆదుకునేందుకు ప్రధాని మోడీ తక్షణ ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి నుండి మరణించిన వారి కుటుంబాలకు రూ. 2 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందించనున్నట్లు తెలిపారు. అలాగే, ఈ ప్రమాదంలో గాయపడిన వారికి రూ. 50,000 చొప్పున ఆర్థిక సహాయం అందజేయనున్నట్లు వెల్లడించారు. ప్రమాద బాధితులకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

## దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సీఎం రేవంత్



మార్కాపురం బస్సు ప్రమాద ఘటనపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. 13 మంది ప్రయాణికులు సజీవదహనమవ్వడం, కొందరు తీవ్రంగా గాయపడటం పట్ల షాక్‌కు గురయ్యారు. ఈ సందర్భంగా ఆయన మృతుల కుటుంబాలకు సానుభూతి తెలియజేశారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. బస్సు తెలంగాణలోని నిర్మల్ నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న నేపథ్యంలో.. ప్రమాదంలో మృతిచెందిన, క్షతగాత్రుల వివరాలను ఏపీ సీఎస్ నుంచి తెలుసుకోవాలని సీఎస్ రామకృష్ణా రావును ఆదేశించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని సీఎం రేవంత్ రెడ్డి ఏపీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు

# 'ఇందిరమ్మ' ఇళ్ల పేరుతో అక్రమ రవాణా!

## అధికారుల అండతో ఎర్రమట్టి దందా..

**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా :** మిర్యాలగూడ డివిజన్ పరిధిలో ఎర్రమట్టి కి గిరాకీ ఎక్కువగా ఉండటంతో అక్రమార్కులు గుట్టలను సైతం తవ్వి మట్టిని తరలిస్తున్నారు. అధికారుల సహకారంతోనే ఎర్రమట్టి అక్రమ వ్యాపారం సాగుతున్నట్లు ఆరోపణ వినిపిస్తున్నాయి. డివిజన్ పరిధిలోని వేములపల్లి మండలం మొల్కపట్నం, శెట్టి పాలెం గ్రామాలతోపాటు మాడుగుల పల్లి మండలంలోని ఇసుకబావిగూడెం, గుర్రప్పగూడెం గ్రామాలలో మిర్యాలగూడ మండలం సుబ్బారెడ్డి గూడెం, ఆలగడప గ్రామాల నుంచి ఎర్రమట్టి అక్రమ దందా కొనసాగుతోంది. కాగా ఈ వ్యాపారానికి అధికారులు పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారు. ప్రభుత్వానికి వచ్చే ఆదాయానికి అధికారుల వల్లనే నష్టం వాటిల్లుతున్నట్టు ప్రజలు పేర్కొంటున్నారు. అక్రమ వ్యాపారాన్ని అడ్డుకోవాల్సిన రెవెన్యూ, మైనింగ్ అధికారులు అక్రమ వ్యాపారులకు పూర్తి సహకారాన్ని అందిస్తున్నారు. దీంతో మూడు జెసిబిలు ఆరు టిప్పర్లు అన్న చందంగా ఎర్రమట్టి వ్యాపారం సాగుతుంది.

**భారీగా ఎర్రమట్టి రవాణా**

డివిజన్ పరిధిలోని ఆయా గ్రామాల నుంచి వందల ట్రిప్పులలో ఎర్రమట్టిని తరలిస్తున్నారు. ఒక్కొక్క ట్రిప్పుకు రూ.3500 నుంచి రూ. 5000 వరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. సంబంధిత అధికారులకు భారీగా ముడుపులు అందించి వ్యాపారం సాగిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. మైనింగ్, రెవెన్యూ అధికారుల సహాయ సహకారాలతోని వ్యాపారం కొనసాగిస్తున్నట్లు తెలుస్తుంది.

**ఇందిరమ్మ ఇండ్ల పేరుతో అనుమతులు**

ఇటీవల కాలంలో ప్రభుత్వం పేద ప్రజల సొంతింటి కల నెరవేరేందుకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసింది. దీని ఆసరాగా తీసుకున్న అక్రమ వ్యాపారులు ఇందిరమ్మ ఇండ్లకు మట్టిని తరలించేందుకు అనుమతులు తీసుకుంటున్నారు. కానీ అనుమతులతో టిప్పర్ల ద్వారా మిర్యాలగూడ పట్టణంలోని రైస్ మిల్లులకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. అధికారులు ముడుపులు తీసుకుని అనుమతులు ఇస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్నిచోట్ల ఎర్రమట్టిని డంపు చేసి ట్రాక్టర్ల ద్వారా అధిక మొత్తంలో విక్రయిస్తున్నట్లు తెలుస్తుంది. ఒక్కొక్క ట్రాక్టర్ మట్టికి పట్టణంలో 3000 రూపాయల వరకు వసూలు చేస్తున్నట్లు పట్టణవాసులు పేర్కొంటున్నారు.

**తీసుకునేది తక్కువ... తరలించేది ఎక్కువ**

ఎర్ర మట్టిని తరలించాలంటే సర్వేనెంబర్ మారినా సరే మైనింగ్ అధికారుల పర్మిషన్ తప్పనిసరిగా ఉండాలి. కానీ పర్మిషన్ లేకుండానే ఎర్ర మట్టిని తరలిస్తున్నారు. వెయ్యి క్యూబిక్ మీటర్లకు అనుమతులు తీసుకొని మూడు వేల క్యూబిక్ మీటర్ల వరకు అక్రమంగా మట్టిని తరలిస్తున్నారు. అనుమతులు ఇచ్చే అధికారులు సైతం కేవలం రోజులు మాత్రమే అనుమతులు ఇస్తున్నారు. ఎలాంటి వాహనాల్లో తరలిస్తున్నారో.. ఆ వాహనాల నెంబర్లు నమోదు చేయడం లేదు. దీంతో అక్రమ వ్యాపారులు మట్టిని తరలించేందుకు అనుమతులు పొందిన ఇష్టారాజ్యంగా టిప్పర్ల ద్వారా మట్టిని తరలిస్తున్నారు. అధికారులకు కంట కనబడుతున్న పట్టించుకోవడం లేదు. చివరికి గుట్టలను మాయం చేస్తుంటే రైతులు ఫిర్యాదు చేస్తే నామమాత్రంగా కేసు నమోదు చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఎర్రమట్టి అక్రమ రవాణాను నిలిపివేసి పర్యావరణాన్ని కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.



# ఏసీబీ వలలో మామడ ఎస్సై

**మామడ,ఫ్లాష్ ఇండియా :** ఓ కేసు విషయంలో రూ. 40,000 లంచం డిమాండ్ చేసిన ఎస్సై ఏసీబీ అధికారులకు చిక్కిన ఘటన నిర్మల్ జిల్లా మామడ పోలీస్ స్టేషన్ లో గురువారం చోటుచేసుకుంది. అదిలాబాద్ ఏసీబీ డి.ఎస్.పి జి మధు కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మామడ ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న అశోక్ ఒక చీటింగ్ కేసు రిజిస్టర్ చేయకుండా ఉండడానికి రూ. 40 వేలు లంచం డిమాండ్ చేశాడు. అనంతరం భేరసారాలు తర్వాత రూ.20,000 ఒప్పందం కుదుర్చుకున్నాడని, దీంతో బాధితుడు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేయగా వారు పన్నిన పథకం ప్రకారం సదరు బాధితుడు లంచం ఇస్తుండగా ఎస్సైని ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. అతడిని అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టి కరీంనగర్ కోర్టుకు తరలించారు. ఈ ఎస్ఐ పై అనేక అవినీతి ఆరోపణాలు ఉన్నాయని ఉన్నతాధికారులు ఆయనను కఠినంగా శిక్షించాలని ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# ఘనంగా రోబో ఫ్యూజన్ ఫెస్ట్

### MMC 9వ డివిజన్ మేడిపల్లి శ్రీ చైతన్య పాఠశాలలో ఘనంగా రోబో ఫ్యూజన్ ఫెస్ట్ –ముఖ్య అతిథిగా పాల్గొన్న తుంగతుర్తి రవి



**జనగాం,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** 9వ డివిజన్ మేడిపల్లిలోని శ్రీ చైతన్య గ్రూప్ ఆఫ్ స్కూల్స్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించే ఉద్దేశంతో నిర్వహించిన రోబో ఫ్యూజన్ ఫెస్ట్ (Robo Fusion Fest) ఘనంగా జరిగింది. మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్, బోడుప్పల్ సర్కిల్ 9వ డివిజన్ మేడిపల్లి పరిధిలో జరిగిన ఈ కార్యక్రమానికి పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,ఆర్‌వి ఫౌండేషన్ చైర్మన్ తుంగతుర్తి రవి గారు ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కత్తిరించి,జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా తుంగతుర్తి రవి గారు మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు కేవలం పుస్తక జ్ఞానానికే పరిమితం కాకుండా, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానమైన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) మరియు రోబోటిక్స్ రంగాల్లో పట్టు సాధించాలని . వింగ్స్ ఆఫ్ ఇన్నోవేషన్ నినాదంతో విద్యార్థులలో సృజనాత్మకతను పెంపొందించడానికి శ్రీ చైతన్య పాఠశాల యాజమాన్యం తీసుకున్న ఈ కార్యక్రమం అభినందనీయమని,ఇటువంటి ప్రదర్శనలు విద్యార్థులను భవిష్యత్తులో గొప్ప శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దడానికి దోహదపడతాయని,విద్యార్థులు తయారు చేసిన రకరకాల రోబోటిక్ మోడల్స్ తమను విశేషంగా ఆకట్టుకున్నాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో శ్రీ చైతన్య గ్రూప్ అఫ్ స్కూల్స్ మేనేజింగ్ డైరెక్టర్ శంభోజు రమేష్ బాబు , చైర్ పర్సన్ శంభోజు శ్రీలత , అకాడమిక్ కోఆర్డినేటర్ విశాల్, ఇంచార్జి ఆశ్ర మరియు పాఠశాల సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# యశోద ఆసుపత్రిలో అరుదైన కేన్సర్ వ్యాధి బాధితుడికి ఉపశమనం...



**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:**

తెలంగాణ రాష్ట్రం నల్గొండ జిల్లా మిర్యాలగూడ కు చెందిన 20 ఏళ్ల యువకుడికి అరుదైన రక్త క్యాన్సర్ అయిన అక్యూట్ ప్రోమైలోసిటిక్ లుకేమియా నిర్ధారణ కావడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. జ్వరం,రక్తస్రావ లక్షణాలతో ఆసుపత్రికి చేరిన యువకుడికి యశోద సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు సకాలంలో చికిత్స ప్రారంభించి, ఆధునిక వైద్య పరీక్షలతో వ్యాధిని నిర్ధారించి,ఏటీఆర్ఏ, ఆర్సెనిక్ ఆధారిత కెమోథెరపీ అందించారు. చికిత్స సమయంలో రోగికి రక్తం,ప్లేట్లెట్ మార్పిడి,యాంటీబయోటిక్స్, యాంటీఫంగల్స్ అందించారు. బహు శాఖల వైద్య బృందం సమన్వయంతో రోగిని నిరంతరం పర్యవేక్షించారు. చికిత్సకు రోగి మంచి స్పందన చూపడంతో ఆరోగ్యం క్రమంగా మెరుగుపడింది. చివరకు రోగిని స్థిరమైన ఆరోగ్య స్థితిలో డిశ్చార్జ్ చేసి ఫాలోఅప్‌కు సూచించారు. ఈ ఘటన యశోద హాస్పిటల్స్‌లో అందుబాటులో ఉన్న అత్యాధునిక కేన్సర్ వైద్య సేవలకు మరో ఉదాహరణగా నిలిచిందని మలక్ పేట్ యశోదా హాస్పిటల్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ చిదుర తెలిపారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ డైరెక్టర్ గోరుకంటి పవన్, యూనిట్ హెడ్ కే శ్రీనివాసరెడ్డి,యశోద ఆసుపత్రి క్యాన్సర్ వ్యాధి వైద్య నిపుణులు డా.వంశీకృష్ణారెడ్డి,ఆసుపత్రి ఇన్చార్జి వాసు కిరణ్ రెడ్డి పాల్గొన్నారు.

# రాజకీయాలకు అతీతంగా పట్టణ అభివృద్ధికి






**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:**

మిర్యాలగూడ మున్సిపల్ కార్యాలయం నందు మున్సిపల్ చైర్మన్ చిలుకూరి సుధా బాలకృష్ణ అధ్యక్షతన మున్సిపల్ మొదటి బడ్జెట్ సమావేశం నిర్వహించారు. పురపాలక సంఘం మొదటి బడ్జెట్ సమావేశంలో ముఖ్య అతిథిగా శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన మైసమ్మ తల్లి పండుగ పురస్కరించుకొని దేవాలయం దర్శించుకొని అనంతరం ఎమ్మెల్యే బిఎల్ఆర్ పురపాలక బడ్జెట్ సమావేశం ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బిఎల్ఆర్ మాట్లాడుతూ నూతన మున్సిపాలిటీ కౌన్సిల్ ఏర్పాటు అయిన తర్వాత ఏర్పాటు చేసిన మొదటి బడ్జెట్ సమావేశం కావున కౌన్సిలర్స్ అందరూ పార్టీలకు రాజకీయాలకు అతీతంగా పట్టణ అభివృద్ధిలో భాగస్వాములు అవ్వాలని పిలుపునిచ్చారు. విమర్శలకు, విబేధాలకి తావులేకుండా సామరస్యంగా అందరూ కలిసి పనిచేయాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ గుడిపాటి శిరీష నవీన్ ,కమిషనర్ శ్రీనివాస్,కౌన్సిలర్లు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సర్ ప్రక్రియకు సహకారం అందించాలి



**జనగాం,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) మ్యాపింగ్ ప్రక్రియను విజయవంతంగా పూర్తిచేయడానికి రాజకీయ పార్టీల ప్రతినిధులు పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. గురువారం మినీ కాన్ఫరెన్స్ హాల్ లో .. ఎస్ఐఆర్ ప్రక్రియ పై జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియను పారదర్శకంగా, ఖచ్చితంగా పూర్తిచేయడానికి రాజకీయ పార్టీల ప్రతినిధులు బూత్ లెవెల్ ఏజెంట్ల జాబితాలను వెంటనే సమర్పించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో బూత్ లెవెల్ అధికారులు మ్యాపింగ్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు, రాజకీయ పార్టీల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. త్వరలో నిర్వహించబోవు (ఎస్. ఐ. ఆర్) స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ గూర్చి ఎలక్షన్ సూపరింటెండెంట్ రాజకీయ పార్టీ ప్రతినిధులకు వివరించారు ఇందులో భాగంగా.. బూత్ లెవెల్ ఆఫీసర్లు, జిల్లాలోని వారి పరిధిలో గల బూత్ లలో ప్రతి ఇంటింటికి వస్తారని వారితో ఒక జత ఎనుమరేషన్ ఫారం ని తీసుకువచ్చి ప్రతి ఓటరు వివరాలు అడిగి తెలుసుకుని వాటిని తగు సమాచారంతో నింపి, ఒక ప్రతిని వారి వెంట తీసుకొని మరొక ప్రతిని ఓటరుకు అందజేస్తారన్నారుఈ సమావేశంలో ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శ్రీధర్,వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు

# వేసవి లో జాగ్రత్త లు పాటించాలి






**జనగాం,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** వేసవి ఎండల నేపథ్యంలో...ప్రజలు జాగ్రత్తగా ఉండాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు వాతావరణ మార్పులు & ప్రజా ఆరోగ్యం అనే అంశం మీద పోలీస్,వైద్యఆరోగ్యం, వ్యవసాయ,గ్రామీణభివృద్ధి శాఖ మున్సిపల్ కమిషనర్ లు, పంచాయతీ శాఖ, తదితర శాఖలకు సంబందించిన అధికారులతో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా జిల్లా స్థాయి సమన్వయ సమావేశాన్ని గురువారం మినీ కాన్ఫెరెన్స్ హాల్ లో నిర్వహించారు వడ దెబ్బకి ఎలాంటి నష్టాలు కలగకుండా....శాఖల వారీగా... వారి పరిధిలో..తీసుకోనున్న యాక్షన్ ప్లాన్ ను కలెక్టర్ ముందుగా ఆయా అధికారులను అడిగి తెలుసుకున్నారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...ప్రయివేట్, ప్రభుత్వ విద్యార్థులకు, గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు, ఆశ వర్కర్ లకు,ORS ప్యాకెట్ లు అలాగే వడ దెబ్బ కి సంబందించిన మందులను పంపిణి చేయాలన్నారు అన్నీ జీపీ, వార్డ్ ల లో, బస్ స్టేషన్ లలో, పోలీస్ స్టేషన్, నిర్మాణాలు జరిగే ప్రాంతాలలో , లేబర్ అడ్డా ల వద్ద కూలి పని చేసే కార్మికుల కోసం చలి వేంద్రం ఏర్పాటు చేయాలన్నారు. వడ దెబ్బకు గురి అయ్యే అవకాశం ఉన్నవారిని అనగా చిన్న పిల్లలు, అధిక రక్తపోటు, మధుమేహ వ్యాధి గ్రాస్తులను ఉందుగానే గుర్తించి వారికీ తగు జాగ్రత్తలు తీసుకునేలా ఆరోగ్య కార్యకర్తల ద్వారా తెలియచేయాలనీ సూచించారు. అలాగే అన్ని ప్రభుత్వ, ప్రయివేట్ విద్య సంస్థ లలో,అంగన్వాడీ కేంద్రాలలో ా=ా పాకెట్స్ అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రత్యేక వార్డ్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అత్యవసరమైతే తప్ప మధ్యాహ్నం వేళల్లో బయటకు వెళ్లకూడదని....ముఖ్యం గా పిల్లలు, వృద్దులు, గర్భిణీలు చాలా జాగ్రత్త గా ఉండాలన్నారు తరచుగా తాగునీరు, మజ్జిగ, నిమ్మరసం, కొబ్బరి నీళ్లు, లేదా ఓఆర్ఎస్ ద్రావణం తీసుకోవాలని ఈ సందర్భంగా కలెక్టర్ ప్రజలకు సూచించారువడదెబ్బ బారిన పడకుండా తీసుకోవలసిన చర్యలపై.. ప్రజలకు ఎప్పటికప్పుడు...అవగాహన కలిగించాలని వివిధ శాఖల అధికారులకు కలెక్టర్ తెలిపారుతీవ్రమైన ఎండ, వడ దెబ్బను ఎదుర్కొనేందుకు ప్రజలు చెయవలిసినవి, చేయకూడని జాగ్రత్తలను తెలీపే పోస్టర్ అలాగే వేసవి లో పశు సంరక్షణ కి సంబందించిన పోస్టర్ లను ఈ సందర్బంగా కలెక్టర్, వివిధ శాఖల అధికారులతో కలిసి ఆవిష్కరించారు ఈ సమావేశం లో డీసీపీ రాజ మహేంద్ర నాయక్, అదనపు కలెక్టర్ బెన్ షాలోమ్, ఏసీపీ పండరి చేతన్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి, డి, ఆర్డీ ఓ, జిల్లా వ్యవసాయ అధికారి, విద్యుత్ శాఖ SE, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు

# యువకుడి ఆత్మహత్య..



**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:**

మిర్యాలగూడ మండల పరిధిలోని యాదగిరిపల్లి లో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటు చేసుకుంది. యాదగిరి పల్లి గ్రామానికి చెందిన పొదిల్ల బలరాములు యొక్క కుమారుడైన పొదిల ఆనంద్ (29 సంవత్సరాలు) వృత్తి టీవీఎస్ ఫైనాన్స్ లో ప్రైవేటు ఉద్యోగి,గురువారం ఉదయం 6 సమయంలో నిద్ర లేచిన అనంతరం ఇంట్లో తిరుగుతూ తన తల్లి అతన్ని ఫ్రెష్ అప్ అయ్యి టిఫిన్ చేయడానికి రమ్మనగా,అతను ఎటువంటి కారణం లేకుండా ఇంటి బెడ్ రూమ్ లోకి వెళ్లి తలుపులు పెట్టుకుని లోపల నుంచి గడియ వేసుకొని చీరతో సీలింగ్ ఫ్యాన్ కు ఉరివేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడినాడు. ఇట్టి విషయమై మృతుని యొక్క తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించడమైనదనీ మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ లక్ష్మయ్య తెలిపారు.



# చేపల వలలో చిక్కుకొని మత్స్యకారుడి మృతి

**తొర్రూరు,ఫ్లాష్ ఇండియా :** మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలంలో విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన అల్వాల మురళి(48) అనే మత్స్యకారుడు ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. నిన్న సాయంత్రం సుమారు 4:30 గంటల సమయంలో మురళి తన కులవృత్తి అయిన చేపలు పట్టడానికి తొర్రూరు చెరువులోకి వెళ్లాడు. అయితే సాయంత్రం 6 గంటల వరకు ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. ఈ క్రమంలో చెరువు వద్దకు వెళ్లి చూడగా, మురళి చేపలు పట్టే వలలో చిక్కుకొని మృతిచెందినట్లు గుర్తించారు. ప్రమాదవశాత్తు వలలో చిక్కుకోవడంతో ఊపిరాడక మృతి చెందినట్లు అనుమానిస్తున్నారు. ఈ ఘటనపై మృతుని తమ్ముడు అల్వాల రాము ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు తొర్రూరు ఎస్సై జి.ఉపేందర్ తెలిపారు.



# సీఎస్‌కే ఓపెనింగ్ కాంబో ఫిక్స్..

ఐపీఎల్ 2025లో నిరాశాజనక ప్రదర్శన తర్వాత చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) 2026 సీజన్‌కు కీలక మార్పులతో సిద్ధమవుతోంది. ముఖ్యంగా ఓపెనింగ్ కాంబినేషన్‌లో మార్పు చోటుచేసుకోనుంది. ఈ విషయాన్ని ఐపీఎల్ 2026 కెప్టెన్స్ డే ఈవెంట్ సందర్భంగా సీఎస్‌కే కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ స్వయంగా ప్రకటించాడు. ఈ సీజన్‌లో తానే ఓపెనర్‌గా బరిలోకి దిగనున్నట్లు స్పష్టం చేశాడు. రుతురాజ్‌తో పాటు కొత్తగా జట్టులో చేరిన స్టార్ బ్యాటర్ సంజు శాంసన్ ఓపెనింగ్ బాధ్యతలు తీసుకోనున్నాడు. దీంతో గత సీజన్‌లో ఓపెనర్‌గా ఆడిన యువ ఆటగాడు ఆయుష్ మాత్రే దిగువన (నెంబర్ 3) బ్యాటింగ్ చేయనున్నాడు. ఐపీఎల్ 2025లో రుతురాజ్ గైక్వాడ్ ఎక్కువగా నెంబర్ 3లో బ్యాటింగ్ చేశాడు. అయితే ఈసారి టీమ్ కాంబినేషన్ దృష్ట్యా అతడిని మళ్లీ ఓపెనర్‌గా పంపాలని సీఎస్‌కే మేనేజ్‌మెంట్ నిర్ణయించింది. మరోవైపు సంజు శాంసన్ ప్రస్తుతం అద్భుత ఫామ్‌లో ఉండటం సీఎస్‌కేకు పెద్ద ప్లస్ పాయింట్‌గా మారింది. ఈ ఇద్దరూ కలిసి ఇన్నింగ్స్ ప్రారంభిస్తే జట్టుకు బలమైన ఆరంభం లభించే అవకాశం ఉందని మేనేజ్‌మెంట్ భావిస్తోంది. రుతురాజ్ నిలకడ, సంజు దూకుడు ఈసారి సీఎస్‌కేకు కలిసొచ్చేలా ఉంది. ముఖ్యంగా సంజు పవర్ ప్లేలో భారీగా రన్స్ రాబడితే.. చెన్నై భారీ స్కోర్ చేయడం లేదా సునాయాస విజయం సాధించడం ఖాయం. టీ20 ప్రపంచ కప్ 2026లో సంజు దంచి కొట్టిన విషయం తెలిసిందే. అయుష్ మ్హాత్రే గత సీజన్‌లో రీప్లేస్‌మెంట్ ప్లేయర్‌గా వచ్చి మంచి ఇంపాక్ట్ చూపించాడు. కేవలం 7 ఇన్నింగ్స్‌లలో 240 పరుగులు చేసి 34.28 సగటు, 188.97 స్ట్రైక్ రేట్‌తో ఆకట్టుకున్నాడు. ముఖ్యంగా ఆర్సీబీపై చేసిన 94 పరుగుల ఇన్నింగ్స్ అతడి టాలెంట్‌ను ప్రపంచానికి చూపింది. ఈ నేపథ్యంలో అతడిని నెంబర్ 3లో ఆడించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. అయితే మ్హాత్రేకు పోటీగా మరికొందరు ఆటగాళ్లు ఉన్నారు. ఉర్విల్ పటేల్ టాప్ ఆర్డర్‌లో దూకుడుగా ఆడగలడు. సర్ఫరాజ్ ఖాన్ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ 2025లో అద్భుతంగా రాణించాడు. అలాగే డేవాల్డ్ బ్రెవిస్ కూడా టీమ్‌లో ఉండటం వల్ల బ్యాటింగ్ ఆర్డర్‌లో పోటీ మరింత పెరిగింది. మరి ఏ ప్లేయర్ ఏ స్థానంలో ఆడుతాడో చూడాలి. ఐపీఎల్ 2026 మార్చి 28ఆ ఆరంభం కానుంది. మొదటి మ్యాచ్‌లో బెంగళూరు, హైదరాబాద్ తలపడనున్నాయి. సీఎస్‌కే తమ తొలి మ్యాచ్‌ను మార్చి 30న గువాహటిలోని బర్సపారా క్రికెట్ స్టేడియంలో రాజస్థాన్ రాయల్స్‌తో ఆడనుంది. ఈ మ్యాచ్‌లో సంజు సాంసన్ తన మాజీ జట్టుపై తొలిసారి బరిలోకి దిగనున్నాడు. కొత్త ఓపెనింగ్ కాంబినేషన్‌తో సీఎస్‌కే ఎలా ఆడుతుందో అని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఆరో టైటిల్ సాధించాలని చెన్నై ఫాన్స్ కోరుకుంటున్నారు.

# నేడు గర్వంగా ఉంది!




ఐపీఎల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్సీబీ) చేతులు మారిన విషయం తెలిసిందే. లీగ్ ఆరంభం నుంచి ఆర్సీబీని నడిపిస్తున్న యునైటెడ్ స్పిరిట్స్ లిమిటెడ్ (యుఎస్ఎల్) సంస్థ.. ఏకంగా రూ.16,706 కోట్ల ధరకు ఆర్సీబీని అమ్మేసింది. ఆదిత్య బిర్లా గ్రూప్, టైమ్స్ ఆఫ్ఇండియా, బోల్ట్ వెంచర్స్, బీఎక్స్‌పీఈ-బ్లాక్‌స్టోన్ సంస్థలు కలిసి ఈ ఫ్రాంచైజీని చేజిక్కించుకున్నాయి. ఆర్సీబీ పురుషులతో పాటు మహిళల జట్టును కూడా కలిపే ఈ నాలుగు సంస్థల కన్సార్షియం సొంతం చేసుకుంది. తాజాగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మాజీ యజమాని విజయ్ మాల్యా, ఫ్రాంచైజీ రికార్డు స్థాయిలో జరిగిన అమ్మకంపై సోషల్ మీడియా ద్వారా స్పందించారు. ఆర్సీబీ కొత్త యజమానులకు హృదయపూర్వకంగా అభినందనలు తెలియజేస్తూ ఒక ఎమోషనల్ పోస్ట్ పంచుకున్నారు. వారికి అంతా మంచే జరగాలని కోరుకున్నారు. ఆర్సీబీ కొత్త యజమానులకు నా హృదయపూర్వక అభినందనలు. ఐపీఎల్‌లోనే అత్యంత ఖరీదైన ఆర్సీబీ ఫ్రాంచైజీతో మీరు మరిన్ని విజయాలు అందుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. 2008లో నేను ఈ ఫ్రాంచైజీని రూ.450 కోట్లకు కొనుగోలు చేసినప్పుడు, చాలా మంది నన్ను చూసి నవ్వారు. అదొక పనికిరాని పెట్టుబడి అని విమర్శించారు. కానీ, ఆ నిర్ణయం వెనుక నా అసలు లక్ష్యం 'రాయల్ ఛాలెంజ్' బ్రాండ్‌ను నిర్మించడం. అందుకే దీనికి ఆర్సీబీ అని పేరు పెట్టాను. నాడు నేను పెట్టిన రూ.450 కోట్ల పెట్టుబడి నేడు రూ.16,500 కోట్లకు పెరగడం చూడటం నాకు ఎంతో గర్వంగా ఉంది. అప్పట్లో యువకుడైన విరాట్ కోహ్లీని జట్టులోకి తీసుకోవడం నా మధుర జ్ఞాపకాలలో ఒకటి. నేడు అతను ప్రపంచంలోనే అత్యుత్తమ ఆటగాళ్లలో ఒకరిగా ఎదిగాడు. ఆర్సీబీని ఆదరిస్తున్న అభిమానులందరికీ నా కృతజ్ఞతలు. 'బెంగళూరు సింహం' అయిన ఆర్సీబీకి మీ మద్దతు ఎప్పుడూ ఇలాగే ఉండాలని కోరుకుంటున్నాను. నమస్కారం" అని విజయ్ మాల్యా ట్వీట్‌లో పేర్కొన్నారు.

# వాళ్లకు గంభీర్ ఒక విలన్‌లా కనిపిస్తాడు..



దక్షిణాఫ్రికా మాజీ కెప్టెన్ ఫాఫ్ డు ప్లెసిస్ టీమిండియా కోచ్ గౌతమ్ గంభీర్‌పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ప్రత్యర్థుల దృష్టిలో గౌతమ్ గంభీర్ 'విలన్'లా కనిపిస్తారన్నాడు. కానీ.. హెడ్ కోచ్‌గా భారత క్రికెట్‌లో కీలక పాత్ర పోషించారని కొనియాడాడు. గంభీర్ తన దూకుడు స్వభావంతో ప్రత్యర్థులను ఇబ్బంది పెడతారని, నాయకుడిగా ఆయన నెలకొల్పిన ప్రమాణాలు అద్భుతమన్నాడు. జియో స్టార్ లో మాట్లాడిన డు ప్లెసిస్.. గంభీర్ గురించి తన అభిప్రాయాలను వెల్లడించాడు. "గంభీర్ కెప్టెన్‌గా కోల్‌కతా నైట్ రైడర్స్‌కు రెండు ఐపీఎల్ టైటిళ్లను, మెంటర్‌గా 2024లో మరో టైటిల్‌ను అందించారు. కోచ్‌గా అతడి హయాంలో భారత్ 2025లో ఛాంపియన్స్ ట్రోఫీ, 2026లో టీ20 ప్రపంచ కప్‌ను గెలుచుకుంది. ఈ ప్రయాణంలో ప్రజలు తన గురించి జనాలు ఏం అనుకుంటున్నారో గంభీర్ పట్టించుకోలేదు. ప్రమాణాలకు అనుగుణంగా ముందుకు సాగడం ప్రశంసనీయం. నేను గంభీర్‌తో కలిసి ఆడలేదు, కానీ ప్రత్యర్థిగా ఆడినప్పుడు ఆయన ఎప్పుడూ కథలో విలన్‌లానే కనిపిస్తారు. అయితే ఆ విషయాన్ని మనం గౌరవించాలి. ఆయనకు ఎవరితోనూ మంచి అనిపించుకోవాలనే తపన ఉండదు, కేవలం గెలవాలనే పట్టుదల మాత్రమే ఉంటుంది. ఒక నాయకుడిగా డ్రెస్సింగ్ రూమ్‌లో క్రమశిక్షణను, జవాబుదారీతనాన్ని పెంచడమే గంభీర్ పని. మంచి నాయకులు చేసేది కూడా అదే." అని పేర్కొన్నాడు. వ్యక్తిగత ఇమేజ్ గురించి పట్టించుకోకుండా, కేవలం జట్టు విజయాల కోసమే పరితపించే గంభీర్ వంటి నాయకులు క్రికెట్‌కు ఎంతో అవసరమని డు ప్లెసిస్ అభిప్రాయపడ్డాడు.

# ఇక్కడికి స్కూల్ పిల్లలు వచ్చారు




పాకిస్తాన్ సూపర్ లీగ్ (పీఎస్ఎల్) 2026 సీజన్ ప్రారంభానికి ముందే మరో ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. లాహోర్‌లోని గడాఫీ స్టేడియంలో నిర్వహించిన కెప్టెన్ల ప్రెస్ కాన్ఫరెన్స్‌లో ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్, కరాచీ కింగ్స్ కెప్టెన్ డేవిడ్ వార్నర్ అసహనం వ్యక్తం చేశాడు. ప్రెస్ కాన్ఫరెన్స్‌లో తాను సిరియస్‌గా మాట్లాడుతుండగా.. ఇతర జట్ల కెప్టెన్లు సరదాగా ముచ్చటించుకోవడంతో వార్నర్ తీవ్ర అసహనం వ్యక్తం చేస్తూ వారిని 'స్కూల్ పిల్లలు' అని వ్యాఖ్యానించాడు. పీఎస్ఎల్ ప్రెస్ మీట్‌లో డేవిడ్ వార్నర్‌తో పాటు మార్నస్ లబుషేన్, షాహీన్ అఫ్రిది, సౌద్ షకీల్, మహ్మద్ రిజ్వాన్ పాల్గొన్నారు. వార్నర్ తన జట్టు ప్రణాళికల గురించి మాట్లాడుతున్న సమయంలో పక్కనే ఉన్న కెప్టెన్లు సరదాగా చర్చించుకుంటూ ఉండటం అతనికి అసౌకర్యంగా అనిపించింది. దీంతో 'ఇక్కడ ఏమవుతోంది?. క్షమించండి, ఇక్కడ కొంతమంది స్కూల్ పిల్లలు ఉన్నారు. వాళ్లు తమను తాము ప్రీమియం అంటున్నారు కానీ.. అసలు వాళ్లు పిల్లల్లానే ప్రవర్తిస్తున్నారు. ప్రెస్ కాన్ఫరెన్స్‌లో ఎలా కూర్చోవాలో, ఎలా ప్రవర్తించాలో కూడా తెలియదు' అంటూ తన అసహనాన్ని వ్యక్తం చేశాడు. అంతర్జాతీయ స్థాయి ఆటగాళ్లు ప్రవర్తనలో కూడా నిబంధనలు పాటించాల్సిన అవసరం ఉందని పరోక్షంగా సూచించాడు. ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. పీఎస్ఎల్ 2025లో డేవిడ్ వార్నర్ కరాచీ కింగ్స్‌కు నాయకత్వం వహించాడు. 11 మ్యాచ్‌లలో 368 పరుగులు చేశాడు. అతని నాయకత్వంలో జట్టు మూడో స్థానంలో నిలిచినా.. ఎలిమినేటర్‌లో లాహోర్ ఖలందర్స్ చేతిలో ఓటమి చవిచూసింది. ఇక పీఎస్ఎల్ 2026 సీజన్ ప్రారంభానికి ముందే పలు వివాదాలతో వార్తల్లో నిలుస్తోంది. మార్చి 26 నుంచి ప్రారంభమయ్యే ఈ టోర్నీ.. క్రికెట్ కంటే ఎక్కువగా ఇతర కారణాలతో హైలైట్ అవుతోంది. ముఖ్యంగా ఇంధన సంక్షోభం, యాజమాన్య నిర్ణయాలు, ప్లేయర్స్ తప్పుకోవడం, ప్రెస్ కాన్ఫరెన్స్‌లో జరిగిన ఘటనలు పీఎస్ఎల్ ప్రతిష్టపై ప్రభావం చూపుతున్నాయి. పశ్చిమ ఆసియా ప్రాంతంలో జరుగుతున్న యుద్ధ పరిస్థితుల ప్రభావంతో పాకిస్తాన్‌లో ఇంధన సంక్షోభం ఏర్పడింది. దాంతో ఈసారి పీఎస్ఎల్ మ్యాచ్‌లను ప్రేక్షకులు లేకుండా (క్లోజ్డ్ డోర్స్) నిర్వహిస్తున్నారు. ఈసారి టోర్నమెంట్‌ను ఆరు వేదికల నుంచి కేవలం రెండు నగరాలకు మాత్రమే పరిమితం చేశారు. లాహోర్, కరాచీ నగరాల్లోనే అన్ని మ్యాచ్‌లు జరగనున్నాయి. ప్రారంభ వేడుకను కూడా రద్దు చేయడం మరో ముఖ్య పరిణామంగా మారింది. టోర్నీ మార్చి 26న ప్రారంభమై మే 3న ఫైనల్‌తో ముగియనుంది. మైదానంలో ఈ సీజన్ ఎలా సాగుతుందో చూడాలి.

# బిజినెస్



# ఫైనాన్స్ బిల్లులో 53 సవరణలు..!

భారత ప్రభుత్వం పన్ను విధానంలో భారీ మార్పులు తేనుందా? అంటే అవుననే సమాచారం అందుతుంది.. ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ 2026 ఫైనాన్స్ బిల్లులో మొత్తం 53 సవరణలు తీసుకువచ్చేందుకు సిద్ధం అయ్యారు.. ఆ సవరణ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నారని సమాచారం. వీటిలో 32 సవరణలు ప్రధానంగా పన్ను విధానాన్ని సులభతరం చేయడానికి, మిగతా 21 సవరణలు పరిపాలనా పరమైనవి అని అధికారులు చెబుతున్నారు..

### ప్రధాన సవరణలు ఏమిటి?

ఈ సవరణల ప్రకారం, పన్ను శాఖకు కోర్టులు మరియు అప్పీల్ ట్రిబ్యునల్స్ ద్వారా ఇచ్చిన ఉత్తర్వుల ఆధారంగా లెక్కింపు కేసులను మళ్లీ ప్రారంభించే అధికారం విస్తరించబడుతుంది. ఇప్పటికే ఉన్న సమయ పరిమితులను మించి కూడా అప్పీల్ అధికారుల తీర్మానాల ఆధారంగా పున:లెక్కింపులు చేయవచ్చు. దీని ద్వారా పాత పన్ను కేసులు కూడా న్యాయస్థానాల ఉత్తర్వుల ఆధారంగా తిరిగి పరిశీలించబడే అవకాశం ఏర్పడుతుంది. మరోవైపు.. పున:లెక్కింపుల సమయంలో ఎదురయ్యే లోపాలను సరిచేసి, స్పష్టమైన నిబంధనలను ప్రవేశపెట్టడం జరుగుతోంది. పన్ను నోటీసులు నిర్దిష్ట సమయ పరిమితితో వస్తాయి.. కనీసం 30 రోజులు, గరిష్టంగా 3 నెలల సమయం కేటాయించబడుతుంది.

### పన్ను అధికారుల భద్రత

ఇంకా, పన్ను అధికారులు ఇచ్చిన ఆమోదాలు సాంకేతిక కారణాల వల్ల చెల్లింపులో సవాలు చేయబడకూడదు అని సవరణల్లో పేర్కొన్నారు. దీని ద్వారా పన్ను శాఖ దావాదారులపట్ల litigationలో బలమైన స్థితిలో ఉంటుంది.

### ప్రోత్సాహకాలు మరియు మినహాయింపులు


SEZ (Special Economic Zone) కు సంబంధించిన పన్ను మినహాయింపులను కొన్ని సందర్భాల్లో 20 సంవత్సరాలుగా పొడిగించే ప్రతిపాదన సవరణల్లో ఉంది. దీనిలో Section 80LA కింద IFSC యూనిట్లను కూడా చేర్చారు. అంతేకాక, ఆంధ్రప్రదేశ్ భూ పూలింగ్ యోజన ప్రయోజనదారుల కోసం కాపిటల్ గెయిన్స్ పన్ను మినహాయింపును కూడా అందిస్తారు. అయితే, ఈ సవరణలు, 2025 మార్చి 31 నుంచి అమలులోకి వచ్చే కొత్త Income-tax Act, 2025కు సిద్ధమవుతున్న సందర్భంలో ప్రవేశపెట్టబడ్డాయి. ఈ కొత్త చట్టం, 1961 చట్టాన్ని రద్దు చేసి, పన్ను విధానాన్ని మరింత సరళతరం చేస్తుంది. మొత్తంగా ఈ సవరణలు పన్ను విధానాన్ని మరింత సమర్థవంతం చేసి, పన్ను శాఖకు పున:లెక్కింపుల పరంగా బలాన్ని ఇచ్చేలా రూపకల్పన చేయబడ్డాయి, అలాగే పన్ను చట్టం వినియోగదారులకు సులభతరం అవ్వడానికి దోహదపడతాయి.

# బంగారం ధరలు మళ్లీ పెరిగాయి..




ఇరాన్-అమెరికా వివాదం నేపథ్యంలో బంగారం, వెండి ధరలు అస్థిరతను ఎదుర్కొంటున్నాయి. బంగారం ధరలు మళ్లీ పెరిగాయి. నేడు గోల్డ్ ధరలు స్వల్పంగా పెరిగాయి. సిల్వర్ ధరలు మాత్రం స్థిరంగా కొనసాగుతున్నాయి. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం పై రూ. 200 పెరిగింది. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం పై రూ. 220 పెరిగింది. హైదరాబాద్ ఈరోజు 22 క్యారెట్ల బంగారం ధర (1 గ్రాము) రూ. 13,465, 24 క్యారెట్ల బంగారం ధర (1 గ్రాము) రూ. 14,689 వద్ద ట్రేడ్ అవుతోంది. ముంబై లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.146,670 వద్ద, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 134,450 వద్ద ట్రేడ్ అవుతోంది. కోల్‌కతా లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.146,670 వద్ద, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 134,450 కి చేరింది. చెన్నై లో24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 148,370 వద్ద, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 136,000 అమ్ముడవుతోంది. హైదరాబాద్ బులియన్ మార్కెట్ లో 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర రూ. 1,34,650 వద్ద ట్రేడ్ అవుతోంది. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,46,890 వద్ద అమ్ముడవుతోంది. విశాఖ పట్నం, విజయవాడలో కూడా ఇవే ధరలు కొనసాగుతున్నాయి. దేశ రాజధాని ఢిల్లీలో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,34,800 వద్ద అమ్ముడవుతోంది. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,47,040 వద్దకు చేరింది. హైదరాబాద్ లో కిలో వెండి రూ.2,60,000 వద్ద అమ్ముడవుతోంది. ఢిల్లీలో రూ. 2,50,000 వద్ద ట్రేడ్ అవుతోంది.

# ఉద్యోగులకు ఊహించని షాకిచ్చిన 'మెటా'..




ఫేస్‌బుక్ మాతృసంస్థ మెటా , తన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విభాగంలో భారీ మార్పులు చేస్తోంది. ఇందులో భాగంగా వివిధ విభాగాలకు చెందిన సుమారు 700 మంది ఉద్యోగులను తొలగిస్తున్నట్లు న్యూయార్క్ టైమ్స్ వార్తను ప్రచురించింది. కంపెనీ తన ఏఐ కార్యకలాపాలను మరింత వేగవంతం చేయడానికి, విభాగాల మధ్య కో-ఆర్డినేషన్ పెంచడానికి ప్రక్షాళన చేపట్టింది. ఈ తొలగింపులు ప్రధానంగా ఏఐ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఫండమెంటల్ ఏఐ రీసెర్చ్ , ఇతర ప్రొడక్ట్ సంబంధిత ఏఐ టీమ్స్‌పై ప్రభావం చూపాయి. ఒకే రకమైన పనులు చేసే టీమ్స్ ఎక్కువగా ఉండటం వల్ల నిర్ణయాలు తీసుకోవడంలో ఆలస్యం జరుగుతోందని, అందుకే సంస్థను మరింత క్రమబద్ధీకరించాలని మెటా నిర్ణయించింది. అయితే, తొలగించిన ఉద్యోగులకు 16 వారాల ప్రాథమిక వేతనంతో పాటు, వారు పనిచేసిన ప్రతి ఏడాదికి అదనంగా రెండు వారాల వేతనాన్ని పరిహారంగా ఇవ్వనున్నట్లుగా సమాచారం.


# అర్జెంటీనా ఆపన్నహస్తం



పశ్చిమాసియాలో జరుగుతున్న యుద్ధం కారణంగా భారత్‌లో ఏర్పడిన ఎల్‌పీజీ కొరతను తీర్చడానికి అర్జెంటీనా ముందుకొచ్చింది. హర్మూజ్ జలసంధి మూసివేతతో ఇంధన సరఫరాకు ఆటంకం ఏర్పడిన వేళ సుమారు 20వేల కి.మీ దూరంలో ఉన్న ఈ దక్షిణ అమెరికా దేశం భారత్‌కు భారీగా గ్యాస్‌ను సరఫరా చేస్తోంది. అయితే, 2026 మొదటి త్రైమాసికంలోనే అర్జెంటీనా భారత్‌కు 50 వేల టన్నుల ఎల్‌పీజీని ఎగుమతి చేసింది. ఇది 2025లో చేసిన మొత్తం సరఫరా కంటే రెట్టింపు కంటే ఎక్కువ కావడం విశేషం.

### యుద్ధం ప్రభావంతో..

భారత్ తన ఎల్‌పీజీ అవసరాల్లో దాదాపు 60 శాతం హోర్ముజ్ జలసంధి మార్గం ద్వారానే దిగుమతి చేసుకుంటుంది. యుద్ధం వల్ల ఈ మార్గం మూతపడటంతో ప్రత్యామ్నాయాల కోసం వెతికింది. అర్జెంటీనాలోని బహియా బ్లాంకా పోర్ట్ నుంచి గుజరాత్ లోని దహేజ్ పోర్ట్‌కు ఉన్న దూరం 20 వేల కి.మీ. కాగా ఇది ప్రపంచంలోనే సుదీర్ఘమైన ఇంధన రవాణా మార్గాలలో ఒకటి నిలిచింది. కానీ, దీంతో రవాణా ఖర్చులు కూడా బాగానే పెరుగనున్నాయి. కేవలం ఎల్‌పీజీయే కాకుండా, హైడ్రోకార్బన్ రంగంలో కూడా భారత్‌తో సంబంధాలను బలోపేతం చేసుకోవడానికి అర్జెంటీనా సిద్ధంగా ఉందని ఆ దేశ రాయబారి మరియానో అగస్టిన్ కుసినో తెలిపారు.



# గ్యాస్ సిలిండర్ ధరలు

గత కొన్ని రోజులుగా ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికా మధ్య జరుగుతున్న యుద్ధం ప్రభావంతో ప్రపంచ చమురు మార్కెట్‌లు అన్నీ కుదేలవుతున్నాయి. దీంతో ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు అనేక ఒత్తిడులను ఎదుర్కొంటున్నాయి. దీంతో దేశవ్యాప్తంగా వంట గ్యాస్ (ఎల్పీజీ) సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతున్నాయి. ఓ వైపు ప్రభుత్వాలు ఎలాంటి కొరత లేదు అన్నప్పటికీ పలురాష్ట్రాల్లో ప్రజలు గ్యాస్ సిలిండర్, గ్యాస్ బుకింగ్ కోసం గంటల కొద్దీ క్యూ లైన్ లో వేచి చూడాల్సి వస్తుంది. వంట గ్యాస్ సరఫరా తగ్గడంతో వాణిజ్య వినియోగదారులతో పాటు గృహ వినియోగదారులు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక ఇలాంటి పరిస్థితుల్లో కొన్ని ప్రధాన నగరాల్లో గ్యాస్ ధరలు ఏ విధంగా ఉన్నాయో ఇప్పుడు చూద్దాం.

హైదరాబాద్ : రూ. 965.00
వరంగల్ : రూ. 984.00
విశాఖపట్నం : రూ. 921.00
విజయవాడ : రూ. 937.50
గుంటూరు : రూ. 944.00




# ట్రెడిషనల్ లుక్‌లో అందాల భామ

తన సహజసిద్ధమైన అందం, నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న రితిక నాయక్ గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. ఈమె విశ్వక్ సెన్ ప్రధాన పాత్రలో రూపొందిన 'ఆకాశవనంలో అర్జున కళ్యాణం' చిత్రంతో తెలుగు తెరకు పరిచయం అయింది. ఈ సినిమా మంచి ప్రేక్షకాదరణ పొందడం, అందులో ఈమె తన నటనతో ప్రేక్షకులను మెప్పించడంతో మొదటి సినిమాతోనే మంచి గుర్తింపు సంపాదించుకుంది.ఆ తర్వాత ఈ బ్యూటీ వరుసగా సినిమాలు చేయకుండా, ఆచితూచి కథలను ఎంచుకుంటూ ముందుకు సాగుతోంది. కొంతకాలం క్రితం ఈమె 'మిరాయ్' అనే పాన్ ఇండియా చిత్రంలో హీరోయిన్‌గా నటించింది. ఈ సినిమాలో కూడా ఎక్కడా స్కిన్ షోకు ప్రాధాన్యం ఇవ్వకుండా, తన నటనతోనే ప్రేక్షకులను ఆకట్టుకుంది.సినిమాల్లో ఎక్కువగా గ్లామర్ షో చేయకుండా అభిమానులను సంపాదించుకున్న ఈ చిన్నది, సోషల్ మీడియాలో కూడా అదే పద్ధతిని ఫాలో అవుతోంది. తాజాగా ఈమెకు సంబంధించిన కొన్ని ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఆ ఫోటోలలో రితిక నాయక్ పీచ్ కలర్ ట్రెడిషనల్ లెహంగా ధరించి ఎంతో అందంగా మెరిసింది.మ్యాచ్ అయ్యే ఎంబ్రాయిడరీ వర్క్, దుపట్టా ఆమె లుక్‌ను మరింత ఆకర్షణీయంగా మార్చాయి. ముఖ్యంగా ఆమె క్యూట్ స్మైల్, కర్లీ హెయిర్ స్టైల్ ఈమె అందాన్ని రెట్టింపు చేశాయి. ఈ ట్రెడిషనల్ అవుట్‌ఫిట్‌లో రితిక నాయక్ ఎంతో క్యూట్‌గా, సొగసుగా మెరిసిపోతూ అభిమానులను ఫిదా చేస్తోంది.దాంతో ఈ బ్యూటీకి సంబంధించిన ఈ ట్రెడిషనల్ లుక్ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతూ, నెటిజన్ల నుంచి ప్రశంసలను అందుకుంటున్నాయి.

# పుష్ప 3పై బిగ్ అప్డేట్..

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, సుకుమార్ దర్శకత్వంలో వచ్చిన పుష్ప ప్రభంజనం సృష్టించిన సంగతి తెలిసిందే. పుష్ప, పుష్ప 2 రెండు సినిమాలు కూడా ఇండస్ట్రీని షేక్ చేశాయి. ఇక త్వరలోనే పుష్ప 3 కూడా రాబోతున్నట్లు సోషల్ మీడియాలో వార్తలు వస్తున్నాయి. దీనికి తగ్గట్టుగానే దర్శకుడు సుకుమార్ సన్నద్ధమవుతున్నట్లు కూడా తెలుస్తోంది. హైదరాబాద్ వేదికగా ఓ ప్రత్యేక ఆఫీస్ ను తీసుకొని ప్రాజెక్టు పైన వర్క్ చేస్తున్నారట సుకుమార్. అయితే ఈ నేపథ్యంలో పుష్ప 3 సినిమాలో అనుష్క శర్మ నటిస్తారని సోషల్ మీడియాలో ఓ పోస్ట్ వైరల్ గా మారింది.తన భర్తతో కలిసి లండన్ లోనే ఉంటున్న అనుష్క శర్మ, 8 సంవత్సరాల తర్వాత మళ్లీ స్క్రీన్ పైన కనిపించేందుకు సిద్ధవ-ంవుతున్నట్లు నడుస్తోంది. అట్లీ-అల్లు అర్జున్ కాంబినేషన్ లో అనుష్క శర్మ నటిస్తుందని ముందుగా వార్తలు వచ్చినప్పటికీ, ఇప్పుడు పుష్ప 3 అంటున్నారు. ఇందులో అనుష్క శర్మకు స్పెషల్ రోల్ ఉంటుందని ప్రచారం చేస్తున్నారు. ఇందులో ఎంత మేరకు వాస్తవం ఉందో తెలియాల్సి ఉంది. కాగా పుష్ప 3 సినిమాలో విజయ్ దేవరకొండ కూడా ఓ స్పెషల్ రోల్ చేయబోతున్నట్లు ఇప్పటికే ప్రచారం జరుగుతున్న సంగతి తెలిసిందే. కాగా పుష్ప ప్రాజెక్టులో హీరోగా అల్లు అర్జున్ నటించగా, హీరోయిన్ గా రష్మిక మెరిశారు.




ఈ ప్రాజెక్టులో యాంకర్ అనసూయ, సునీల్, సందడి చేయగా మొదటి సినిమాలో సమంత ఐటెం సాంగ్ చేసింది. రెండో పార్ట్ లో శ్రీ లీల స్టెప్పులు ఇరగదీసింది.

# నేనే మిస్టేక్ చేసా




"నేను చేసిన ఒక తప్పు వల్లే '1 నేనొక్కడినే' చిత్రం ప్రేక్షకులను పూర్తిగా ఆకట్టుకోలేదేమో అనిపిస్తుంది. వాస్తవానికి ఆ సినిమా స్టోరీ రాసిన తర్వాత మేము రెండు రకాల స్క్రీన్‌ప్లేలను అనుకున్నాం. మొదటి వెర్షన్‌లో ఇంటర్వెల్ వచ్చేసరికి హీరోకు ఎలాంటి వ్యాధి ఉండదు, మొత్తం ఒక నాటకం ఆడుతూ అందరిని మోసం చేస్తున్నట్లు చూపించాలని భావించాం. రెండో వెర్షన్ మాత్రం ఇప్పుడు ప్రేక్షకులు చూసిన విధంగానే ఉంటుంది. హీరోకు ఎలాంటి వ్యాధి లేకుండా అందరిని మోసం చేస్తున్నట్లు చూపిస్తే ప్రేక్షకులకు ఎమోషనల్ ఫీల్ రాదనే ఉద్దేశంతో మేము ప్రస్తుతం ఉన్న స్క్రీన్‌ప్లే వైపు మొగ్గు చూపాం.అయితే మేము అనుకున్న ఆ రెండో రకం స్క్రీన్‌ప్లేను కూడా పూర్తిగా షూట్ చేసి, రెండు వెర్షన్‌లను పక్కపక్కన చూసుకుని నిర్ణయం తీసుకుని ఉంటే మా అభిప్రాయం మారేదేమో. అలా చేసి ఉంటే సినిమా మరింత మంచి ఫలితాన్ని సాధించి ఉండేదేమో అని తర్వాత అనిపించింది" అని సుకుమార్ వెల్లడించారు. విడుదల సమయంలో బాక్సాఫీస్ వద్ద ఫ్లాప్‌గా నిలిచిన ఈ సినిమా, తర్వాత కాలంలో మాత్రం ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణను సంపాదించుకుంది. రాక్ స్టార్ దేవిశ్రీప్రసాద్ సంగీతం అందించిన ఈ చిత్రంలో నాజర్ విలన్ పాత్రలో నటించి ఆకట్టుకున్నారు.



# మృణాల్ మళ్లీ ఊపిరినిచ్చిందా?

ధనుష్-మృణాల్ ఠాకూర్ మధ్య లవ్ ట్రాక్ నడుస్తోందన్న వార్త ఇప్పటిదీ కాదు. ఇద్దరు కలిసి పార్టీల్లో సందడి చేయడం, సన్నాఫ్ సర్దార్ 2 ప్రీమియర్స్‌కు ధనుష్ రావడం, ఆమెతో క్లోజ్‌గా మూవ్ కావడంతో డేటింగ్ రూమర్లకు రెక్కలొచ్చాయి. తేరీ ఇష్క్ మే రిలీజ్ టైంలోనూ ఇలాంటి కథలొచ్చాయి. ఇక దో దీవానే సెహర్ మే టీజర్‌పై ధనుష్ లుక్స్ అండ్ సౌండ్స్ గుడ్ అంటూ కామెంట్ చేయడంతో వీరి మధ్య సంథింగ్ సంథింగ్ నడుస్తోందని నెటిజన్స్ డిసైడయ్యారు. కానీ మా మధ్య ఏమీ లేదని మృణాల్ తేల్చేశారు.ధనుష్-మృణాల్ ఠాకూర్ మధ్య నథింగ్ అట అని డిసైడ్ అవుతోన్న టైంలో మళ్లీ డేటింగ్ వార్తలు ఊపందుకున్నాయి. డెకాయిట్ హిందీ ప్రమోషన్స్‌లో భాగంగా అడవి శేష్‌తో ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న మృణాల్.. తమిళంలో కొన్ని పదాలు మాట్లాడారు. అదీ కూడా తడుముకోకుండా. ఇందులో ఏముంది అనుకోవచ్చు కానీ.. ఇప్పటి వరకు ఆమె తమిళంలో ఒక్క సినిమా చేయలేదు. మూవీకి కమిటైన దాఖలాలు కూడా లేవు. అలాంటిది తమిళ భాషలో మాట్లాడటం చూసి.. ఈ టాలెంట్ ధనుష్ నుంచే వచ్చిందని నెటిజెన్స్ కామెంట్స్ చేస్తున్నారు. మృణాల్ చెన్నై రావడం వెనుక అతడే కారణమంటున్నారు. ఇలాంటి రూమర్స్‌తో ఫ్రీ పబ్లిసిటీ, అటెన్షన్ గ్రాబ్ అయితే చేసుకుంటున్నారు కానీ.. సక్సెస్ మాత్రం టేస్ట్ అందడం లేదీ. మరి తాజా గాసిప్స్‌పై మృణాల్ ఎలా స్పందిస్తారో చూడాలి.

# నిక్‌లో నిజాయతీ ఉంది..



ప్రియాంక చోప్రా, నిక్ జోనస్ విడిపోతున్నారంటూ వస్తున్న వార్తలపై ఆమె గట్టిగానే స్పందించారు. 'మేము విడాకులు తీసుకుంటున్నామంటూ కొన్ని వార్తలు నా చెవిన పడ్డాయి. మా పెళ్లి బంధం ముగిసిపోవాలని కొందరు కోరుకుంటున్నారా? అనిపిస్తోంది. అసలు మా బంధం గురించి ఇలాంటి రూమర్లు ఎందుకు వస్తున్నాయో అర్థం కావడం లేదు. ఇదంతా వారి భ్రమ మాత్రమే. వేర్వేరు దేశాలు, వేర్వేరు మతాలు, మా మధ్య ఉన్న వయసు తేడా వల్ల కొందరికి మా బంధం ఇబ్బందిగా అనిపిస్తుండవచ్చు. కానీ మేము ఎనిమిదేళ్లుగా కలిసే ఉంటున్నాం. ఇతరులు ఏమనుకుంటున్నారో అని ఆలోచించడం నేను ఎప్పుడో మా-నేశాను' అని ప్రియాంక చెప్పుకొచ్చారు.తమ వివాహ ప్రయాణం గురించి ప్రియాంక చోప్రా చెబుతూ... 'మా పరిచయం తర్వాత కేవలం ఆరు నెలల్లోనే పెళ్లి చేసుకున్నాం. అప్పట్లో అసలు ఏం జరుగుతుందో, అది నిజమో కాదో కూడా తెలియని అయోమయ స్థితిలో ఉన్నాను. అయితే నిక్‌లో ఉన్న నిజాయతీ నన్ను ఆకర్షించింది' అని చెప్పారు. కుటుంబ భద్రత విషయంలో తాను చాలా కఠినంగా ఉంటానని తెలిపారు. 'నేను నా కుటుంబం, ముఖ్యంగా నా కుమార్తె భద్రత విషయంలో చాలా జాగ్రత్తగా ఉంటాను. ఎవరైనా నన్ను నేరుగా కలిసి ఫోటోలు తీసుకోవాలనుకుంటే నాకు ఇష్టమే. నాతో మాట్లాడటానికి వచ్చే వ్యక్తులను నేను గౌరవిస్తానని నా సెక్యూరిటీ గార్డులకు కూడా తెలుసు. కానీ అనుమతి లేకుండా దొంగ చాటుగా ఫొటోలు తీయడం నాకు నచ్చదు. ఈ రోజుల్లో ప్రతి ఒక్కరి దగ్గర సెల్‌ఫోన్లు ఉంటున్నాయి. మేము పార్కులో ఉన్నా లేదా ఎక్కడైనా భోజనం చేస్తున్నా.. ఆ పిక్స్ వెంటనే సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు. అందుకే నా కూతురి ప్రైవసీ కోసం సెక్యూరిటీని ఏర్పాటు చేసుకున్నాను. లేకపోతే నాకు వ్యక్తిగత భద్రత అవసరం లేదు' అని వివరించారు.

# వెనక్కి తగ్గిన పెద్ది, కొత్త రిలీజ్ డేట్ ఇదేనా?




మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'పెద్ది' చిత్రం విడుదల తేదీపై మరోసారి సందిగ్ధత నెలకొంది. ముందుగా ఈ చిత్రాన్ని చరణ్ పుట్టినరోజు కానుకగా మార్చి 27న విడుదల చేయాలని భావించినా, అది సాధ్యం కాకపోవడంతో అధికారికంగా ఏప్రిల్ 30, 2026కి వాయిదా వేశారు. అయితే, తాజా పరిణామాలు చూస్తుంటే ఈ తేదీ కూడా మారే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ సినిమా వాయిదా పడబోతుందనే వార్తలకు ఊతమిస్తూ, ఓవర్సీస్ మార్కెట్‌లో బుకింగ్స్ తేదీలు మారిపోయాయి. మొదట మార్చి 27 నుంచి ప్రారంభం కావాల్సిన ఓవర్సీస్ అడ్వాన్స్ బుకింగ్స్, ఇప్పుడు ఏప్రిల్ 8వ తేదీకి వెళ్లింది. దీనికి కారణం సాంకేతిక కారణాలు అని చెబుతున్నప్పటికీ, సాధారణంగా పెద్ద సినిమాల బుకింగ్స్ ఇలా వెనక్కి వెళ్లాయంటే, సినిమా విడుదల తేదీలో కూడా మార్పు ఉండే అవకాశం ఉందని ట్రేడ్ నిపుణులు భావిస్తున్నారు.ప్రస్తుత ఉన్న సమాచారం ప్రకారం, సినిమా షూటింగ్ ఇంకా కొంత భాగం మిగిలి ఉండటం మరియు పోస్ట్ ప్రొడక్షన్ పనులకు మరింత సమయం పట్టేలా ఉండటంతో, సినిమాను మే 21, 2026కి వాయిదా వేసే ఆలోచనలో మేకర్స్ ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. అంటే, మూడు వారాలు వెనక్కి వెళ్లనుందన్నమాట. అయితే చిత్ర యూనిట్ మాత్రం ఏప్రిల్ 30 నాటికే సినిమాను సిద్ధం చేయాలని శతవిధాలా ప్రయత్నిస్తోంది. కానీ, క్వాలిటీ విషయంలో ఎక్కడా రాజీ పడకూడదనే ఉద్దేశంతో ఒకవేళ పనులు పూర్తి కాకపోతే మే నెలకు వెళ్లడం ఖాయమని తెలుస్తోంది. అయితే, మరోవైపు రామ్ చరణ్ మాత్రం కంటి గాయమైన కూడా షూటింగ్ సకాలంలో పూర్తి చేయాలనే పట్టుదలతో, విరామం తీసుకోకుండా తిరిగి సెట్స్‌లోకి అడుగుపెట్టారు. బుచ్చిబాబు కూడా ఎట్టిపరిస్థితుల్లోను ఏప్రిల్ 30న సినిమాను థియేటర్లోకి తీసుకురావాలనే పట్టుదలతో ఉన్నాడు. రేపు చరణ్ బర్త్ డే సందర్భంగా టీజర్ కూడా రిలీజ్ చేస్తున్నారు. కాబట్టి, మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన వస్తే తప్ప ప్రస్తుతానికి పెద్ది వాయిదా లేనట్టే!

# స్కైని తాకిన మమితా పాపులారిటీ..



'ప్రేమలు' లాంటి డబ్బింగ్ చిత్రంతో సౌత్ మొ-త్తం రాత్రికి రాత్రే స్టార్ డమ్ సంపాదించుకున్న మలయాళ కుట్టీ 'మమితా బైజు'. మాలీవుడ్‌లో 15 సినిమాలు చేసినా రాని లక్.. ప్రేమలుతో దక్కడంతో దాన్ని క్యాష్ చేసుకుని పనిలో బిజీ అయ్యారు. తెలుగులో పెద్దగా ఆఫర్స్ రాకపోవడంతో.. పొరుగున ఉన్న కోలీవుడ్‌పై మమితా ఫోకస్ పెట్టారు. రెబల్ దెబ్బేసినా.. డ్యూడ్ హిట్‌తో అమ్మడి పాపులారిటీ స్కైని తాకింది. యూత్ అటెన్షన్ గ్రాబ్ చేయడంలో సక్సెస్ కావడంతో.. తమిళ్ ఫిల్మ్ మేకర్స్ మమితా కాల్షీట్స్ కోసం క్యూ కట్టారు.ప్రేమలు తర్వాత మంచి ఆఫర్స్ వస్తాయని ఊహించిందీ కానీ.. ఏకంగా స్టార్స్ హీరోలైన విజయ్ దళపతి, సూర్య, ధనుష్‌లతో నటించే గోల్డెన్ ఛాన్స్ కొట్టేశారు మమితా బైజు. విజయ్ జననాయగన్‌తో పాటు సూర్య విశ్వనాథ్ అండ్ సన్స్, ధనుష్ కరలో నటిస్తున్నారు. అదే సమ-యంలో సెలక్టివ్ సబ్జెక్ట్స్ చూజ్ చేసుకుంటూ.. మూవీ మూవీకి వేరియేషన్ చూపిస్తూ.. డిఫరెంట్ క్యారెక్టర్స్ ఎక్స్ ప్లోర్ చేస్తున్నారు.జన నాయగన్‌లో విజయ్ దళపతి కూతురిగా.. స్ట్రాంగ్ గర్ల్ రోల్ మమితా బైజు చేస్తున్నారు. సూర్య విశ్వనాథ్ అండ్ సన్స్‌లో పూర్తి కాంట్రాస్ట్ క్యారెక్టర్ చేస్తున్నారు. తన కన్నా 20 ఏళ్ల పెద్దయిన వ్యక్తి ప్రేమలో పడి, అతడి లవ్ కోసం పరితపించిపోయే నాటీగర్ల్ రోల్‌లో కనిపించబోతున్నారు. ఇక ధనుష్ కరలో పక్కా పల్లెటూరి అమ్మాయిగా, ఫక్తు డీ గ్లామర్ రోల్ చేయబోతున్నారు. విష్ణు విశాల్ ఇరుండు వానం ప్యూర్ లవ్ స్టోరీగా రాబోతుంది. ఇలా డిఫరెంట్ షేడ్స్‌ను చూపిస్తూ.. ఏ పాత్రకైనా తాను ఫిట్ అవ్వగలనని మమితా ప్రూవ్ చేసుకుంటున్నారు.

# అది అస్సలు నిజం కాదు



సంగీత్ శోభన్, నయన్ సారిక జంటగా నటిస్తున్న లేటెస్ట్ చిత్రం 'రాకాస'. పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌పై నిహారిక కొణిదెల ఈ సినిమాను నిర్మిస్తుండగా, మానస శర్మ దర్శకత్వం వహిస్తున్నారు. కామెడీ, ఫ్యాంటసీ జానర్‌లో రాబోతున్న ఈ సినిమాలో తనికెళ్ల భరణి, ఆశిష్ విద్యార్థి కీలక పాత్రలు పోషిస్తున్నారు. సాధారణంగా శోభన్ బాబు వారసులుగా వస్తున్న సంతోష్ శోభన్, సంగీత్ శోభన్ సినిమాలకు ప్రభాస్ తన వంతు మద్దతు ఇస్తుంటారు. అయితే, ప్రభాస్ కెరీర్‌లో మైల్ స్టోన్ లాంటి 'వర్షం' సినిమాను శోభన్ గారు నిర్మించడం వల్లే ఆయన ఇప్పుడు కృతజ్ఞతగా వీరిని ఎంకరేజ్ చేస్తున్నారని కొందరు అనుకుంటున్నారు. ఈ విషయంపై పలు పుకార్లు కూడా షికారు చేస్తున్నాయి. కొందరు దారుణంగా విమర్శిస్తున్నారు. ఈక్రమంలో.. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న సంగీత్ శోభన్ ఈ విషయంపై స్పందించారు."చాలామంది ఏమనుకుంటారంటే, మా నాన్నగారు తీసిన 'వర్షం' సినిమా బ్లాక్ బస్టర్ హిట్ అవ్వడం వల్లే ప్రభాస్ గారు నన్ను, మా అన్నయ్యను ఎంకరేజ్ చేస్తున్నారని అనుకుంటారు. కానీ అది అస్సలు నిజం కాదు. ఒకవేళ ఆ సినిమా డిజాస్టర్ అయి ఉన్నా సరే, ప్రభాస్ గారు మమ్మల్ని ఇలాగే సపోర్ట్ చేసేవారు. ఎందుకంటే అది ఆయన క్యారెక్టర్. ఒక మనిషికి సహాయం చేయాలన్నా, తోడుగా ఉండాలన్నా ఆయన ఫలితం గురించి ఆలోచించరు" అని చెప్పుకొచ్చారు. మంచి కామెడీ టైమింగ్ ఉన్న సంగీత్ శోభన్, ఈ 'రాకాస' చిత్రంతో మరో హిట్ కొట్టాలని చూస్తున్నారు. ఈ సినిమాను ఏప్రిల్ 3న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేశారు. గెటప్ శ్రీను, వాసు ఇంటూరి వంటి కామెడీ స్టార్స్ ఉండటంతో ఈ చిత్రం అవుట్ అండ్ అవుట్ ఎంటర్‌టైనర్‌గా ఉంటుందని ఫ్యాన్స్ భావిస్తున్నారు.

Edited, Printed, Published & Owned by KOMARAJU SRINIVASULU and Printed at Ramu Graphics, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229